నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
మెదక్
బుధవారం | 10 జులై 2024 | www.navatelangana.com

తెలంగాణ మోడల్ స్కూల్‌లో రోబోటిక్స్ కార్యక్రమం



నవతెలంగాణ-రామచంద్రాపురం

సంగారెడ్డి జిల్లాలో రోబోటిక్స్ కార్యక్రమం ప్రారంభి ంచిన పది పాఠశాలల్లో తెల్లాపూర్ మున్సిపాల్టీ పరిధిలోని వెలిమెల తెలంగాణ మోడల్ స్కూల్ ఒకటి. ఈ కార్యక్ర మాన్ని మంగళవారం సోహమ్ అకాడమీ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ నిర్వహించింది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ రాం ప్రసాద్ మాట్లాడుతూ.. 20 మంది విద్యార్థులను ఎంపిక చేయడం ద్వారా రోబోటిక్స్ క్లబ్‌ను ఏర్పాటు చేయ డానికి ప్రారంభ సెషన్ ఈరోజు ప్రారంభించారన్నారు. 20 మంది విద్యార్థులతో కూడిన క్లబ్‌కు కెప్టెన్ మరియు ఇద్దరు వైస్ కెప్టెన్లు నాయకత్వం వహిస్తారు. ఓరియంటేషన్ సెషన్ ప్రకారం క్లబ్ ఏడాది పొడవునా కార్యకలాపాలను నిర్వహి స్తుంది. సోహన్ అకాడమీ కార్యకలాపాలను నిర్వహిం చడానికి అవసరమైన కిట్‌లు మరియు పుస్తకాలను అందిసు న్నారని తెలిపారు. వ్యవస్థాపకుడు సహదేవ్, జిల్లా సైన్స్ అధికారి సిద్ధా రెడ్డి, టీం లీడ్ రాహుల్ , జోషి ప్రసూన రామాంజనేయులు, ఉపాధ్యాయులు,విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మట్టి తరలింపును అడ్డుకున్న వ్యక్తిపై దాడి



నవతెలంగాణ-తూప్రాన్

తూప్రాన్ మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన శివ రమేష్ అనే వ్యక్తి తన పొలానికి సమీపంలో అక్రమంగా మట్టి తరలిస్తున్నారని, మట్టి తరలింపుతో తన సొంత పొలానికి ఇబ్బంది ఏర్పడుతుందని,మట్టి తరలింపు చేయొద్దని, మైనింగ్ ఇరిగేషన్ అధికారులకు గత మూడు రోజుల క్రితం ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారులు 3 రోజులపాటు ఎలాంటి మట్టి తరలింపు జరగకుండా ఆపేశారు. మళ్లీ మట్టి తరలింపు చేయాలనే ఉద్దేశంతో టిప్పర్ లారీలతో మట్టిని తీసుకువెళు న్న సమయంలో శివ రమేష్ అనే వ్యక్తి అడ్డుకోగా, శివ నెల్లూరు తో పాటు ఇతరులు శివ రమేష్ పై భౌతికదాడి చేసి రాడ్లతో తీవ్రంగా కొట్టారు.భౌతిక దాడిలో శివ రమేష్ ఒక చేతి విరిగిపోగా, తీవ్ర గాయాలతో ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి ప్రథమ చికిత్స చేయించుకొని, స్థానిక పోలీస్ స్టేషన్ లో శివ రమేష్ ఫిర్యాదు చేశారని తూప్రాన్ ఎస్ఐ శివానంద తెలిపారు.

డిమాండ్ల సాధనకై...
కార్మిక పోరాటాలు



- 4 లేబర్ కోడ్‌ల రద్దు.. కనీస వేతనం రూ.26 వేల కోసం సమరం
- 73 షెడ్యూల్డ్ పరిశ్రమల జీవోలను సవరించాలి
- ఆశాలు, అంగన్వాడీ, మిడ్డే మిల్స్ కార్మికులు
- వేతనాల్లేని జీపీ, మున్సిపల్ కార్మికులు
- నేడు 'కార్మికుల కోర్కెల దినం' సందర్భంగా ఆందోళనలు

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

బీజేపీ బాటలోనే కాంగ్రెస్ ప్రభుత్వం పయనిస్తుంది. కేంద్రంలోనే కాదు రాష్ట్రంలోనూ కార్మిక వ్యతిరేక విధానాలనే అవలంబిస్తున్నారు. కార్మికుల ఉనికినే ప్రమాదంలోకి నెట్టేందుకు బీజేపీ ప్రభుత్వం 4 లేబర్ కోడ్‌లను తేవాలని చూస్తుండగా పరిశ్రమల యాజమాన్యాల ఒత్తిడికి తలొగ్గి 73 షెడ్యూల్డ్ ఎంపాయిమెంట్స్‌లో కనీస వేతనాల్ని సవరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధపడట్లేదు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ, బొగ్గు బ్లాకులను వేలం వేయడం వంటి అంశాల్లో బీజేపీ, కాంగ్రెస్ రెండు ఒకే విధానంగా ముందుకెళు న్నాయి. బీజేపీ కార్మిక వ్యతిరేక విధానాలను నివారించి, కార్మిక హక్కుల్ని కాపారుడుకునేందుకు దేశ వ్యాప్తంగా కార్మిక సంఘాల ఐక్య వేదిక ఉధృతంగా పోరాడింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలతో పాటు ఉద్యోగ, కార్మికులకు ఇచ్చిన హామీల్ని అమలు చేయాలని సీఐటీయూ పోరాడుతుంది. 10న 'కార్మికుల కోర్కెల దినం' సందర్భంగా ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా కార్మికులు ధర్నాలు, ఆందోళనలు చేయనున్నారు.

4 లేబర్ కోడ్‌లు పెను ప్రమాదం

కేంద్రంలోని బీజేపీ తీసుకురావాలనుకుంటున్న 4 లేబర్ కోడ్‌ల వల్ల కార్మికుల ఉనికికే పెను ప్రమాదం వాటిల్లే ప్రమాదముంది. స్వాతంత్ర్యానికి పూర్వం నుంచే పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాల్ని రద్దు చేసి కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసం 4 లేబర్ కోడ్‌లు తేవాలని బీజేపీ చూస్తుంది. కార్మికులు దేశ వ్యాప్తంగా అనేక సమ్మె పోరాటాలు చేసిన ఫలితంగా తాత్కాలికంగా వాయిదా వేసినా ఏదో సందర్భగా లీక్‌లు ఇస్తునే ఉంది. కంపెనీలో పనిచేసే కార్మికులకు కనీసం యూనియన్ పెట్టుకునే హక్కు లేకుండా చేస్తుంది. యాజమాన్యాల దయాదాక్షణ్యాలపై కార్మికులు ఆధార పడేలా చట్టాలను సవరించారు. లేబర్ కోడ్‌లను రాష్ట్ర ప్రభుత్వం సైతం వ్యతిరేకించట్లేదు. వీటి వల్ల ఉమ్మడి మెదక్ జిల్లాలో ఉన్న లక్షలాది మంది కార్మికులు నష్టపోనున్నారు.

73 షెడ్యూల్డ్ పరిశ్రమల జీవోల సవరణ

73 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్‌లో పనిచేస్తున్న కార్మికులకు కొత్త జీవోలను విడుదల చేశారు. ఆ జీవోల వల్ల కార్మికులకు పైసా జీతం పెరగలేదు. షెడ్యూల్డ్ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాల్ని సవరించాల్సిన సర్కార్ యాజమాన్యాల ఒత్తిళ్లకు బయపడి వేతనాలు పెంచకుండానే జీవోలు ఇచ్చింది. ఈ జీవోల వల్ల సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో ఉన్న వేలాది పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు జీతాలు పెరగక తీవ్రంగా నష్టపోతున్నారు. జీవోలను సవరించి ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని పరిశ్రమల కార్మికులు బుధవారం పెద్ద ఎత్తున ఆందోళనలకు చేయనున్నారు.

ఆందోళనలో అంగన్వాడీలు, ఆశాలు

అంగన్వాడీ టీచర్లు, ఆయాలు తమను పర్మినెంట్ చేయలని ఎప్పటి నుంచో పోరాడుతున్నారు. గత ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. ఈ ప్రభుత్వం కూడా అదే బాటలో నడుస్తోంది. అంగన్వాడీల రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ విషయంలో అన్యాయం చేస్తోంది. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌ను టీచర్లకు రూ.10, ఆయాలకు రూ.5 లక్షలివ్వాలని కోరుతూ ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా దీక్షలు చేస్తున్నారు. గతంలో కనీస వేతనాలు రూ.26 వేలు ఇవ్వాలని కోరుతూ అనేక రూపాల్లో పోరాడారు. ఆశా వర్కర్లకు రాత పరీక్ష పెట్టాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరైంది కాదని పోరాడుతున్నారు. ఎన్నో ఏళ్లుగా సేవ చేస్తున్న ఆశాలపై ఆంక్షలు పెట్టి అన్యాయం చేయాలని చూస్తున్నారు. మధ్యాహ్న భోజన కార్మికులు సైతం గౌరవ వేతనం కాకుండా నికర వేతనం ఇవ్వాలని, విద్యార్థులకు ఇచ్చే డైట్ ఛార్జీలు పెంచాలని కోరుతు పోరాడుతున్నారు. ఐకేపీ వీఓఏలు, వైద్య, ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరుతూ పోరాడుతున్నారు.

కార్మికుల డిమాండ్స్

కార్మికుల కోర్కెల దినం సందర్భంగా పలు డిమాండ్లను ప్రభుత్వాల ముందు ఉంచుతున్నారు. ముఖ్యంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరణ ఆపాలి. నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్‌ని రద్దు చేయాలి. బొగ్గు బ్లాకులను వేలం వేయడాన్ని నిలుపుదల చేయాలి. సింగరేణికి నేరుగా బొగ్గు గనులు కేటాయించాలి. కార్మికులందరికీ రూ.26 వేల కనీస వేతనం నిర్ణయించాలి. సమాన సనికి-సమాన వేతనం ఇవ్వాలి. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలి. 73 షెడూల్డ్‌బ పరిశ్రమల జీవోలను సవరించి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలి. ఆశా వర్కర్లకు పరీక్ష రద్దు చేయాలి. కనీస వేతనం అమలు చేయాలి. అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్న భోజనం, ఐకేపీ విఓఎ, వైద్య, ఆరోగ్య శాఖతో వివిద స్కీమ్‌లలో పనిచేస్తున్న స్కీమ్ వర్కర్లను కార్మికులుగా గుర్తించి చట్టాలు అమలు చేయాలి. జీవో 5ని సవవరించాలి. మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలి. గ్రామ పంచాయతీ కార్మికులకు వేతనాలు పెంచి పెండింగ్ వేతనాలు చెల్లించాలి. మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి. అప్పటి వరకు ఏపీ మాదిరి వేతనాలు చెల్లించాలి. ఈపీఎఫ్ చెల్లింపులో జాప్యం చేసిన వారికి జరిమానాలను తగ్గించడాన్ని ఉపసంహరించుకోవాలి. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కార్మికులకు హయ్యర్ పెన్షన్ చెల్లించాలి. కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలి. పాత పెన్షన్ అమలు చేయాలి. భవన నిర్మాణ కార్మికుల గడువు ముగిసిన వెల్ఫేర్ కార్డులను రెన్యువల్ చేయాలి. కొత్తవారిని బోర్డులో నమోదు చేయాలి. హమాలీ, ట్రాన్స్‌పోర్ట్ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి. హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలి. పశుమిత్రలను కార్మికులుగా గుర్తించాలి. పనికి తగ్గ పారితోషికం, గుర్తింపు కార్డులు ఇవ్వాలి. బీడీ కార్మికులందరికీ ఏలాంటి షరతుల్లేకుండా జీవన భృతి ఇవ్వాలి. కోప్టా చట్టాన్ని రద్దు చేయాలి. సింగరేణిలో కాంట్రాక్టు కార్మికులకు కోలిండియా వేతనాలను అమలు చేయాలి. ఆర్టీసీ సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలివ్వాలి. విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఆర్టిజన్స్‌నందర్నీ అర్హతలను బట్టి ప్రయోషన్స్ ఇవ్వాలి. తెలంగాణ మీ-సేవా ఉద్యోగులకు జీవో నెంబర్ 60 ప్రకారం కనీస వేతనాలు అమలు చేయాలి. మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్‌కు స్టాటూటరీ వర్కింగ్ రూల్స్‌ను రూపొందించాలి.

సమరశీల పోరాటాలు: జి.సాయిలు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి

10న కార్మికుల కోర్కెల దినం సందర్భంగా ధర్నాలు, ఆందోళనలు జరగనున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వలు రెండూ కార్మిక వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్నాయి. రాబోయే కాంలో కార్మిక వర్గం సమరశీలంగా ఉద్యమాలు చేపట్టనుంది. జిల్లాలో జరిగే ధర్నాల్లో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలి.

ఆలయ ఏఈఓ ను సస్పెండ్ చేయాలి

- బాసరలో సస్పెండ్ అయినా తీరు మారలే..
- మల్లన్న ఆలయ కాంట్రాక్టర్ల నుంచి కమిషన్లు
- తోటి ఉద్యోగులపై దాడులకు పాల్పడుతున్న వైనం
- సెలవు పెట్టకుండా విహారయాత్రలు చేసిన చర్యలు లేవు
- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి



నవతెలంగాణ- కొమురవెల్లి

మల్లన్న ఆలయ ఏఈవో గంగా శ్రీనివాస్‌ను సస్పెండ్ చేయాలని సీపీఐ(ఎం) పార్టీ మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా సత్తిరెడ్డి మాట్లాడుతూ.. ఆలయంలో ఏఈవోగా విధులు నిర్వహిస్తున్న గంగా శ్రీనివాస్ గతంలో బాసర ఆలయంలో డబ్బులు వాడుకొని అవినీతికి పాల్పడితే దేవాదాయ శాఖ అధికారులు సస్పెండ్ చేశారని తెలిపారు. పైరవీలు చేసి తిరిగి ఉద్యోగంలో చేరి కొమురవెల్లి మల్లన్న ఆలయానికి వచ్చాడని ఇక్కడ కూడా ఆలయ కాంట్రాక్టర్ల ను బెదిరిస్తూ కమిషన్లు వసూలు చేస్తున్నాడన్నారు. ఇటీవల సెలవు పెట్టకుండా విహారయాత్రలకు ఇతర రాష్ట్రాలకు వెళ్లి వచ్చిన అనంతరం హాజరు పుస్తకంలో విధులు నిర్వహించినట్టు సంతకాలు చేశాడని తెలిపారు. సాక్షాత్తు ఆలయ ఈవో బాలాజీ ముందే తోటి ఉద్యోగి పై భౌతిక దాడికి పాల్పడ్డాడని, మల్లన్న జాతర సమయంలో వీవీఐపీ పాసులను అమ్ముకొని పట్టుబడ్డాడని తెలిపారు. అతనిపై స్థానిక పోలీస్ స్టేషన్లో రెండు కేసులు నమోదు అయ్యాయని తెలిపారు. ఆలయంలో గంగా శ్రీనివాస్ ఇన్ని తప్పులు చేస్తు అవినీతికి పాల్పడుతున్న ఈవో బాలాజీ అతనిపై చర్యలు చేపట్టకుండా సహకరిస్తున్నాడని మండిపడ్డారు. ఇతనిపై రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రికి ఆ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.వెంటనే ఇతనిపై విచారణ చేపట్టి శాశ్వతంగా ఉద్యోగం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు తేలు ఇస్తారి, తాడూరి మల్లేశం, వుల్లంపల్లి సాయిలు, బక్కెల్లి బాలకిషన్, నాయకులు సార్ల యాదయ్య, కరోళ్ల ఎల్లయ్య,ఎండి గోరెమియ, శ్రవణాచారి, రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు

సైనిక్ స్కూల్లో దారుణం

- అర్ధరాత్రి స్కూల్ నుంచి విద్యార్థిని గెంటేసిన ప్రిన్సిపల్
- లక్షల ఫీజులు తీసుకుంటున్న యాజమాన్యం
- అధికారుల చూపు అటువైపుగా లేదు





నవతెలంగాణ- ములుగు

లక్ష్మక్క పల్లి గ్రామంలో ఉన్న సైనిక్ స్కూల్లో దారుణం చోటు చేసుకుంది. ఆదివారం అర్ధరాత్రి ఒంటిగంటకు వాటర్ తాగడానికి వచ్చిన విద్యార్థి అక్కడ ఆ సమయంలో వార్డెన్ చూసి ప్రిన్సిపల్ కు సమాచారం ఇచ్చాడు. ఇద్దరు కలిసి ఆరవ తరగతి చదువుతున్న జాస్మిన్ అనే విద్యార్థిని ప్రిన్సిపల్ బయటకు గెంటేశారు. అక్కడి నుంచి ఆ విద్యార్థి ఎదురుగా ఉన్న ఆర్వీఎం ఆసుపత్రి దగ్గరికి వెళ్లి చూడగా ఎవరు కనిపించకపోవడంతో బ్యాగ్ వేసుకొని నడుచుకుంటూ వెళ్తూ దారిలో అతనిని ఒకరు చూసి వివరాలు అడిగి వాళ్ల తల్లిదండ్రులకు ఫోన్ చేశారు. క్యాబ్ సహాయంతో ఆ విద్యార్థి వాళ్ళ ఇంటికి చేరుకున్నాడు. వాళ్ల తల్లిదండ్రులు మా అబ్బాయి మా ఇంటి కి రావడమే క్షేమంగా భావించి ఉదయమే వచ్చి ములుగు పోలీస్ స్టేషన్ పరిధిలో పాఠశాల యాజమాన్యం పై కేసు పెట్టారు.లక్ష్మక్కపల్లి గ్రామంలో ఉన్న వెరిటాస్ స్కూల్ ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. స్టేట్ సిలబస్ ఉంచి స్కూల్లో ఏకంగా సెంట్రల్ సిలబస్‌తో పర్మిషన్ లేకుండా నడుపు తున్నారన్నారు. ఈ ఘటనపై తెలంగాణ మాదిగ హక్కుల దండోరా నాయకులు మండిపడ్డారు పాఠశాల పై విచారణ జరిపించి మూసి వేయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్‌హెచ్‌డీ వ్యవస్థాపక అధ్యక్షుడు మారుమళ్ళ మల్లేశం మాదిగ, కత్తి లింగయ్య మాదిగ, రాష్ట్ర అధ్యక్షులు తదితరులున్నారు

పూర్వ వీఆర్వోలను యథా స్థానాలకు తీసుకోవాలి



నవతెలంగాణ-పటాన్‌చెరు

రెవిన్యూ శాఖలో కీ-రోల్‌గా ఉన్న వీఆర్వోలను బీఆర్ఎ స్ ప్రభుత్వం వివిధ శాఖలకు బదిలీ చేసిందని.. వారందరినీ యథా స్థానాలకు తీసుకోవాలని వీఆర్వోల సంఘం ఆధ్వర్య ంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డికి మంగళవారం విన తి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీఆర్వోలను రెవె న్యూ శాఖ నుంచి వివిధ శాఖలకు బదిలీ చేయడం సరైన పద్ధతి కాదని.. వీఆర్వోలను యథా స్థానాల్లో చోటు కల్పించాలని డిమాండ్ చేశారు. 1998 నుంచి రెవెన్యూ శాఖలో వేరువేరు పేర్లతో వీఆర్వోలుగా పనిచేస్తూ.. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలిచిన తమను ఇష్టారీతిన వేరే శాఖలకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేటాయించింద న్నారు. ఏకపక్షంగా వీఆర్ఓ వ్యవస్థను రద్దుచేసి.. గతేడాది జూలైలో రెడీ ఎంప్లాయిమెంట్ పేరుతో లాటరీ ద్వారా 5576 మందిని బలవంతంగా బదిలీ చేశారన్నారు. రెవెన్యూ శాఖలో తమను మిగులు సిబ్బందిగా నిర్ధారించి రీడిఎం ప్లాయిమెంట్ పేరుతో బదిలీ చేయడంతో పలు శాఖలలో తమ హెూదాలు, హక్కులు హరించబడ్డాయ న్నారు. అనుభ వజ్ఞులైన పూర్వ వీఆర్ఓలను రెవెన్యూ శాఖలోకి వెనక్కి రప్పించి విలేజ్ ఎస్టాబ్లిష్మెంట్ సృష్టించి పోస్టులో సర్దుబాటు చేస్తే.. ఏకకాలంలో సిబ్బంది కొరత తీరుతుందన్నారు. తదా ్వరా రాష్ట్ర ఖజానా పైన ఎలాంటి ఆర్థిక భారం ఉండ బోద న్నారు. ధరణి కమిటీ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లా లని కోరారు. రెవిన్యూ శాఖలోని తమ గత అనుభవాన్ని పరిగణించి ఒక సమగ్ర న్యాయబద్ధ పరిష్కారం చూపి రెవెన్యూ శాఖ ప్రతిష్ఠతకు కృషి చేయాలని కోరారు. సాను కూలంగా స్పందించిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి.. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి తమ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ విఆర్వోలు పాండు, మల్లేశం, విజయ్ కుమార్, శ్రీనివాస్, నాగయ్య, రామచంద్రయ్య, నాగేశ్వరరావు, సత్తమ్మ తదితర మాజీ వీఆర్వోలు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి

- ఎండీ సాజిద్



నవతెలంగాణ-దుబ్బాక:

ఈనెల 13వ తేదీన నిర్వ హించ తలపెట్టిన వికలా ంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్ఆర్ పీడీ) జిల్లా మూడో మహాసభలను విజయవంతం చేయాలని ఎన్ఆర్ పీడీ జిల్లా అధ్యక్షుడు ఎండీ సాజిత్ కోరారు.పలు ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న వికలాంగుల బ్యాక్ లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.మంగళవారం దుబ్బాక పురపాలిక కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఎన్ఆర్ పీడీ జిల్లా మూడవ మహాసభలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2011 జనాభా లెక్కల ప్రకారం దేశంలో 2.21శాతం మంది వికలాంగులు ఉన్నారని, ఘనాంకాల రిపోర్ట్ ప్రకారం 19 శాతం మంది చూపు, వినికిడి లోపం కలిగి ఉన్నారని, 8 శాతం మంది బహుళ వైకాల్యం కలిగి ఉన్నారన్నారు.76 శాతం మంది గ్రామీణ ప్రాంతంలో, 24 శాతం మంది పట్టణ ప్రాంతంలో నివసిస్తున్నారన్నారు.ప్రభుత్వ, ప్రభుత్వయేతర సౌకర్యాలు వికలాంగులకు అందడం లేదన్నారు. జులై 13వ తేదీన జిల్లా మహాసభ ఎన్ఆర్ పీడీ సిద్దిపేట జిల్లా 3వ మహాసభ సిద్దిపేట పట్టణంలో నిర్వహిస్తున్నామని తెలిపారు.మహాసభల్లో జిల్లాలోని వికలాంగుల సమస్యలను చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు.జిల్లాలోని వికలాంగులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో లక్ష్మీ నర్సయ్య, నర్సింలు, రవి, రాజయ్య, రమేశ్ ఉన్నారు.

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయాలి

- ప్రభుత్వ లక్ష్యాలను పూర్తి చేయాలి
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పకడ్బందిగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్య దర్శి శాంతి కుమారి అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వన మహెూత్సవం, మహిళా శక్తి, సీజనల్ వ్యాధులు, ఉద్యోగుల బదిలీలు తదితర అంశాలపై సమీక్షించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ గత జూన్ మాసంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వరంగల్ జిల్లాలో మహెూత్సవం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారని, రాష్ట్రవ్యాప్తంగా 20 కోట్లకు పైగా మొక్కలు నాటే లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిందని, జిల్లాల వారీగా కేటాయించిన లక్ష్యాలను సాధించాలని, గ్రామాలకు అవసరమైన మొక్కలను, అందులో పెద్ద మొక్కలను నాటాలని, ప్రతి మొక్కను జియో టాగ్ చేయాలని సూచించారు. ఆడబిడ్డలను ఆర్థికంగా శక్తిమంతులను చేసి వారిని కోటీశ్వరులను చేయడమే మహిళా శక్తి పథకం ముఖ్య ఉద్దేశమని, ఈ పథకాన్ని జిల్లాలలో దిగ్విజయంగా నెరవేర్చాలని సూచించారు. స్వయం సహాయ సంఘాల ద్వారా పలు రకాల సూక్ష్మ పరిశ్రమలు, వ్యాపారాలను ప్రోత్సహించి సంఘాలలో సభ్యులుగా ఉన్న మహిళల ఆర్థిక స్వావలంబనకు సహకరించడం, మహిళల సామాజిక భద్రత కోణంలో సంఘాలను బలోపేతం చేయడం మహిళా శక్తి పథకం ప్రధాన ఉద్దేశాలని, సూక్ష్మ తరహా పరిశ్రమలను గుర్తించి సంఘాలను ప్రోత్సహించడం, మహిళలు తమ నైపుణ్యాలకు తగ్గ ఉత్పత్తులను ఎంచుకుని, ఆ ఉత్పత్తులకు అవసరమైన నైపుణ్యాన్ని అందించడం, ఉత్పత్తికి అవసరమైన ఆర్థిక సహకారం కోసం బ్యాంక్ లింకేజీల సదుపాయం కల్పించడం, ఉత్పత్తి అయిన సరుకులు మార్కెటింగ్ కు అవసరమైన ప్రణాళికలు, సహకారం అందివ్వడం మహిళాశక్తి పథకంలో భాగమని, 16 రకాల జీవనోపాదులు ఇందులో భాగమని, ఈ పథకాన్ని జిల్లాలో దిగ్విజయంగా అమలు చేసి ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చాలని, జిల్లా, మండల మహిళా సమాఖ్యలతో సమావేశాలు ఏర్పాటు చేసుకొని యాక్షన్ ప్లాన్ తో వర్క్ షాప్ లు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. తెలిపారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమతంగా ఉండాలి. సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలల్లో పారిశుధ్యం ముఖ్యమని, కిచెన్, టాయిలెట్స్ పరిశుభ్రంగా ఉండాలని, నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, డెంగీ, మలేరియా, అతిసారా వ్యాధుల పట్ల అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, ఆశా, ఎ.ఎన్.ఎం. సిబ్బంది క్షేత్ర స్థాయిలో క్రియాశీలకంగా ఉండాలని, ఆరోగ్య కేంద్రాలలో మందులు అందుబాటులో ఉండాలని సూచించారు. వ్యవసాయ రంగం సంబంధించి ఎరువులకు ఎలాంటి కృత్రిమ కొరత లేకుండా చూడాలని, రైతు భరోసా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, రైతు నేస్తం ప్రోగ్రాముల ద్వారా రైతులకు కావలసిన సలహాలు, నూతన సాగు విధానాలపై ప్రోత్సాహక కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టిన పనులలో పూర్తి కాని పనులను వెంటనే చేయాలని తెలిపారు. టీచర్ల బదిలీలు విజయవంతంగా జరిపిన విధంగానే ఉద్యోగుల బదిలీలు నిబంధనలను పాటిస్తూ ఈనెల 20 లోగా ముగించాలని తెలిపారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు, మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్, సిద్దిపేట కలెక్టర్ మను చౌదరి, అదనపు కలెక్టర్లు మాధురి , గరిమా అగర్వాల్, శ్రీనివాస రెడ్డి, జి.వెంకటేశ్వర్లు ఇతర అధికారులు ఆర్ డి ఓ జ్యోతి ,జడ్పీసీఈఓ జానకిరెడ్డి ,డి ఎఫ్ ఓ శ్రీధర్,డి పి ఓ సాయిబాబా, డీఈఓ వెంకటేశ్వర్లు, డీడీ సోషల్ వెల్ ఫేర్ అఖిలేష్ రెడ్డి పాల్గొన్నారు.

బొగ్గు గనుల ప్రయివేటీకరణను ఆపాలి



నవతెలంగాణ-మెదక్‌టౌన్

సింగరేణి బొగ్గు గనుల ప్రయివేటీకరణ వ్యతిరేకంగా మంగళవారం మెదక్ పట్టణంలోని కిషన్ భవన్‌లో కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు జిల్లాలో ఏఐటీయూసీ కూడా కలిసి వచ్చిందన్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్య క్షులు ఎ. మల్లేశం మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తం గా అన్ని కార్మిక సంఘాలు సింగరేణి ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తున్నా యన్నారు. కేంద్రంలో మూడవసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం వెంటనే మళ్లీ ప్రయివేటీకరణ చర్యలకు పూనుకున్నది. కేంద్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత బీజేపీ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలోని శ్రావణపల్లి బొగ్గు గనుల వేలం పాటను ప్రకటించిందన్నారు. ఇప్పటికే అరబిందో సంస్థకు బొగ్గు గనిని ప్రయివేటీకరణ చేసిందన్నారు. ఎలాంటి అనుభవం లేని ప్రయివేటు సంస్థకు కేంద్ర ప్రభుత్వం గనులను అప్పగించిందన్నారు. మరోసారి వేలం పాట ప్రకటిస్తే సింగరేణి సంస్థను కూడా వేలంపాటలో పాల్గొనాలని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. తెలంగాణలోని అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థగా సింగరేణి సంస్థ ఉన్నదన్నారు. ఈ సింగరేణి సంస్థ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంవత్సరానికి పన్నుల రూపంలో రూ. 8 వేల కోట్లు సింగరేణి సంస్థ చెల్లిస్తున్నదన్నారు. బీజేపీ పరిపాలించిన గత పదేండ్ల కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రూ. 49 వేల కోట్లకు పైగా సింగరేణి సంస్థ డెవిడెన్స్ రూపంలో చెల్లించిందన్నారు. ఇలాంటి ప్రభుత్వరంగ సంస్థను ప్రయివేటీకరణ చేయాలని బీజేపీ చూస్తున్న చర్యను సీఐటీయూ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం సింగరేణి బొగ్గు వేలాన్ని వెనక్కి తీసుకోవాలని, ప్రయివేటీకరణను ఆపాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయన్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి 8 మంది ఎంపీలు గెలిచారు. బీజేపీ ఎంపీలు తమ ప్రభుత్వానికి సింగరేణి వేలంపాటను రద్దుచేసి, ప్రయివేటీకరణను ఆపాలని లేఖ రాయాలని ఈ రౌండ్ టేబుల్ సమావేశం సందర్భంగా డిమాండ్ చేస్తుందన్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా సింగరేణి సంస్థ వేలాది మందికి ఉపాధి చూపుతుందన్నారు. ఇలాంటి సంస్థను ప్రయివేటీకరణ చేయడం సరైన పద్ధతి కాదన్నారు. నేషనల్ పైపులైన్ లో భాగంగా బొగ్గు బ్లాగులను ప్రయివేటీకరణ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పూనుకున్నాదన్నారు. దీనికి వ్యతిరేకంగా రాష్ట్రంలో ఇప్పటికే అన్ని కార్మిక సంఘాలు కార్యాచరణలను తెలిపాయన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం సింగరేణి వేలం పాటను రద్దుచేసి, ప్రయివేటీకరణను ఆపాలని కార్మిక సంఘం నాయకులు రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానం చేశారన్నారు. లేనిపక్షంలో ప్రజా సంఘాలను, రాజకీయ పార్టీలను కలుపుకొని పెద్ద ఎత్తున పోరాటం నిర్వహిస్తామని ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఇది సింగరేణి కార్మికుల డిమాండ్ మాత్రమే కాదు తెలంగాణ రాష్ట్ర ప్రజల అందరి డిమాండ్ అని దీనికి ప్రజలు అందరూ కలిసి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి బసవరాజు, కోశాధికారి నర్సమ్మ, ఏ ఐటీయూసీ జిల్లా కార్యదర్శి నందం, నాయకులు కె. మల్లేశం, అజయ్, కమల, సత్యం, తదితరులు పాల్గొన్నారు.

అదనంగా 25 బస్సులు మంజూరు చేయండి

- మంత్రికి ఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి వినతి



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

నారాయణఖేడ్ నియోజకవర్గానికి సరిపడా బస్సులు లేకపోవడంతో ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని.. నారాయణఖేడ్ డిపోకు 25 బస్సులు అదనంగా ఇవ్వాలని స్థానిక ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి హైదరాబాద్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో రవాణా శాఖ, బీసీ సంక్షే మ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడు తూ.. బస్సుల్లేక నారాయణఖేడ్ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పుడున్న బస్సులు సరిపోవట్లేదని.. దాంతో రోజువారీ పనులకు వెళ్లేవారు నానా అవస్థలు పడు తున్నారన్నారు. ఇక్కడి ప్రజలకు రవాణా సమస్య తీరాలంటే కనీసం 25 నూతన బస్సులు మంజూరు చేయడంతో పాటు డ్రైవర్లు, కండక్టర్‌లను భర్తీ చేయాలని విన్నవించా రు. మంత్రి సానుకూలంగా స్పందించి బస్సుల ఏర్పా టు తొందరలోనే చేస్తానని.. డ్రైవర్స్, కాండక్టర్లను టీఎస్పీ ఎస్సీ ద్వారా నియామకాలు చేస్తామని హామీ ఇచ్చినట్టు తెలిపారు.

'ఎస్సీ హాస్టల్'సమస్యలు తక్షణమే పరిష్కరించాలి



నవతెలంగాణ-పటాన్‌చెరు

ఎస్సీ హాస్టల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్క రించాలని ఎస్ఎఫ్ఐ పటాన్‌చెరు డివిజన్ కన్వీనర్ రవి కిరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్సీ హాస్టల్ విద్యా ర్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ ఉప తహసీల్దార్ కార్తీక్‌కు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళ వారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డివిజన్ కన్వీనర్ రవి కిరణ్ మాట్లాడుతూ.. పటాన్‌చెరులోని ఎస్సీ హాస్టల్ లోని విద్యార్థులు అనేక సమస్య లతో సతమతమవుతున్నా రన్నారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 3 నెలల కింద బోర్ రిపేరు అయినప్పటికీ.. ఇంతవరకు బాగు చేయలేదనన్నారు. హాస్టల్‌కి ప్రహరీ గోడ లేక పోవడంతో బయటి వ్యక్తులు లోపలికి వస్తున్నారని.. దాంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. అంతేకాకుండా పందులు, కుక్కలు, విష సర్పాలు కూడా హాస్టల్‌లోకి వస్తు న్నాయని.. వెంటనే ప్రహరీ గోడ నిర్మించాలన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై 2నెలలు గడుస్తున్నా ఇంతవరకు విద్యార్థులకు దుప్పట్లు, ట్రంక్ పెట్టెలు ఇవ్వలేదని వాపో యారు. హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పట ికైనా హాస్టల్లో నెలకొన్న సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలన్నారు. లేని పక్షంలో పెద్దఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తుకారం, అర్జున్, భాస్కర్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ న్యాయవాది వైద్యనాథ్ పాటిల్‌కు సన్మానం

నవతెలంగాణ-సంగారెడ్డి



సంగారెడ్డి జిల్లా కోర్టులో నూతనంగా ప్రభుత్వ న్యాయవాదిగా ఎన్నుకోబడిన సీనియర్ న్యాయవాది వైద్యనాథ్ పాటిల్ ని సంగారెడ్డి బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఏ. విష్ణువర్ధన్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేసి సన్మానించారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ వైద్యనాథ్ పాటిల్ ఈ అవకాశాన్ని పరిపూర్ణంగా ఉపయోగించుకోవాలని అలాగే జీవితంలో ఇంకా ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

మురుగు నీటి సమస్యను పరిష్కరిస్తాం

నవతెలంగాణ-జహీరాబాద్



ఉత్తమ్‌నగర్‌కాలనీ మురుగు నీటి సమస్యను పరిష్కరిస్తామని మున్సిపల్ కమిషనర్ హామీ ఇచ్చారు. ఉత్తమ్ నగర్ కాలనీలో మురుగు కాలువలను నిర్మించాలని కాలనీ వాసులు వినతి పత్రం ఇవ్వడంతో.. కమిషనర్ కాలనీలో మంగళవారం పర్యటించారు. కాలనీలో డ్రెయినేజీ, రోడ్స్ అవసరమని, వాటిపై అధికారు లతో ఎస్టిమేట్ వేయించి పరిష్కారా నికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ సంధ్య, రవీందర్ రెడ్డి, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మహిపాల్, కాలనీవాసులు శ్యామ్, రాజు పటేల్, పవన్, నారాయణ తదితరులున్నారు.

ఏజీపీగా నేతనియల్ నియామకం

నవతెలంగాణ-జహీరాబాద్



జహీరాబాద్ ఏజీపీగా న్యాయవాది నేతనియల్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా స్థానిక కోర్ట్ ఆవరణలో పలువురు న్యాయవాదులు ఆయన్ను పూలమాల శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

1110 గ్రాముల గంజాయి పట్టివేత



నవతెలంగాణ-రామచంద్రాపురం

గంజాయిని తరలిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్న ఘటన రామచంద్రాపురం పట్టణంలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన సరోజ్‌కుమార్ జీవనోపాధికి పటాంచెరుకు వలస వచ్చాడు. అతడు గంజాయి విక్రయించి.. డబ్బులు సంపాదించుకోవాలనుకున్నాడు. ఈ క్రమంలో గంజాయిని తీసుకుని తన బైక్‌పై బండ్లగూడకు వెళ్తున్నాడు. కాగా నమ్మదగిన సమాచారం మేరకు క్రైమ్ పోలీసులు రామచంద్రాపురం వద్ద సరోజ్ కుమార్ బైక్‌ను ఆపి తనిఖీలు చేశారు. దాంతో అతని వద్ద 1110 గ్రాముల గంజాయి పట్టుబడింది. అతడి బైక్, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. అదుపులోకి తీసుకున్న సరోజ్ కుమార్‌ను రిమాండ్‌కు తరలించామన్నారు.

ఈనెల 12న ఉచిత డయాబెటిక్, కిడ్నీ వైద్య శిబిరం

నవతెలంగాణ-జహీరాబాద్

ఈనెల 12వ తేదీన స్థానిక ప్రగతి నర్సింగ్ హోమ్‌లో ఉచితంగా డయాబెటిక్, కిడ్నీలకు సంబంధించిన వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు వైద్యశాల నిర్వాహకులు డాక్టర్ శివబాబు తెలిపారు. హైదరాబాద్ నుంచి డయాబెటిక్ కిడ్నీ వైద్యనిపుణులు సయ్యద్ మహమ్మద్ గుఫాన్ ఈ శిబిరానికి ముఖ్యఅతిథిగా పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఈ శిబిరం కొనసాగుతుందన్నారు. 8790753203 నెంబర్‌ను సంప్రదించి పేరును రిజిస్టర్ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సదావకాశాన్ని జహీరాబాద్ నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మాజీ సర్పంచ్‌ను పరామర్శించిన నరోత్తం

నవతెలంగాణ-జహీరాబాద్



ఝరాసంగం మండలం మాచూరు గ్రామ మాజీ సర్పంచ్ స్వామిదాసు అనారోగ్యంతో బాధపడు తూ ఆసుపత్రిలో చికిత్సపొంది ఇటీవలే ఇంటికొచ్చాడు. ఈ నేపథ్యంలో ఆయన్ను ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ వై.నరోత్తం మంగళవారం పరామర్శించాడు. అతని యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శంకర్, జి.నర్సింలు, నబిసాబ్, వై.తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మెన్ కొలను రోజా బాల్‌రెడ్డి అన్నారు. బొల్లారం పుర పాలక సంఘం పరిధిలోని 19వ వార్డ్ పోచమ్మ బస్తీలో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా వైద్య శిబిరాన్ని మంగళవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. లార్వా ఉత్పత్తి చెందకుండా.. వర్షాకాలంలో ప్రబలే డెంగ్యూ, మలేరియా వ్యాధులపై ఇంటి ఇంటికి తిరుగుతూ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ బాచుపల్లి సంధ్యా జైపాల్‌రెడ్డి, మెడికల్ ఆఫీసర్ రాధిక, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్ కుమార్, సునీత, సంతోష్‌రెడ్డి, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్‌లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు పుటినరోజు శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

నవతెలంగాణ-న్యాల్‌కల్



జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు పుట్టినరోజు సందర్భంగా మల్గి గ్రామ బీఆర్ఎస్ ఆఫీస్‌లో స్థానిక నాయకులు కేక్‌కట్ చేసి ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. మరిన్ని ఇలాంటి ఎన్నో పుట్టినరోజు జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో మల్గి మాజీ సర్పంచ్ మారుతి యాదవ్, సిద్దారెడ్డి, అఖిల్ తదితరులు ఉన్నారు.

డిమాండ్స్ డేను జయప్రదం చేయాలి



నవతెలంగాణ-జహీరాబాద్

నేటి డిమాండ్స్ డేను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పి.రాజిరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా కార్మికుల సమస్యలు, కనీస వేతనం రూ.26వేలు, లేబర్ కోడ్స్ రద్దు, తదితర సమస్యలపై నేడు జరిగే డిమాండ్స్ డేను జయప్రదం చేయాలన్నారు. మహీంద్రా ట్రాక్టర్స్ లో కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ఈ డిమాండ్స్ డే జరుగుతుందన్నారు. కాబట్టి పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో క్లస్టర్ కన్వీనర్ ఎస్.మహిపాల్, యూనియన్ ప్రధాన కార్యదర్శి గణేష్, నాయకులూ వంశిక్రిష్ణ, బాబు, మహేశ్వర్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

నవతెలంగాణ-మనూర్



పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ఎంపీపీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఎంపీడీఓ మంగ అలివేలుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ డివిజన్ కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ.. తక్కువ వేతనంతో పని చేస్తున్నా..నెలనెలా వేతనాలు ఇవ్వకుండా పెండింగ్ పెట్టడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా స్పందించి.. వెంటనే పెండింగ్ వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో 23 గ్రామాల కార్మికులు పాల్గొన్నారు.

పేదలకు ఇండ్ల స్థలాలు ఇప్పించాలి

నవతెలంగాణ-జిన్నారం

మాదారం పంచాయతీ పరిధిలో గల 729 సర్వేనెంబర్ ప్రభుత్వ భూముల్లో 250 మంది పేద కుటుంబాలకు ఇళ్ల స్థలాలు ఇప్పించాలని కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు, మాజీ వార్డ్ మెంబర్ కలాలి రాజుగౌడ్ పటాన్చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాటా శ్రీనివాస్‌గౌడ్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం వినతి పత్రాన్ని అందజేశారు. స్పందించిన కాటా శ్రీనివాస్ గౌడ్.. పేద కుటుంబాలకు ఇండ్ల పట్టాలు ఇప్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

అక్రమంగా మట్టిని తరలిస్తున్న రెండు వాహనాల పట్టివేత

నవతెలంగాణ-మునిపల్లి

మండల పరిధిలోని మొగ్దుంపల్లి గ్రామ శివారులోని 108 సర్వే నెంబర్‌లో అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తున్న రెండు టిప్పర్లను రెవెన్యూ, పోలీసు అధికారులు మంగళవారం పట్టుకున్నారు. ఈ సందర్భంగా అక్రమ మైనింగ్‌కు పాల్పడ్డ వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మొగ్దుంపల్లి నుంచి సదాశివపేటకు మట్టిని తరలిస్తున్న వాహనాలను సీజ్ చేసి బుదేరా పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తహసీల్దార్ తెన్మొలి, ఎస్ఐ సురేష్ తెలిపారు.

చినుకు పడితే చిత్తడే..

- ఏండ్లు గడుస్తున్నా పూర్తికాని బ్రిడ్జీలు..
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు

నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ నియోజకవర్గంలో పంచాయతీరాజ్ ఆర్ అండ్‌బీ రోడ్ల పరిస్థితి దయనీయంగా మారింది. గత ప్రభుత్వాలు రోడ్ల మరమ్మలకు అనుకున్న స్థాయిలో నిధులు కేటాయించకపోవడంతో ఎక్కడ చూసినా గుంతల రోడ్లే దర్శనమిస్తున్నాయి. గతంలో మంజూరైన బ్రిడ్జి నిర్మాణం పనులు పూర్తవకపోవడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. జహీరాబాద్, కోహిర్, మొగుడంపల్లి, నాల్కల్, ఝరాసంగం మండలాల్లోని వివిధ గ్రామాలకు అనుసంధానంగా ఉన్న రోడ్లకు సంబంధించి.. గత కొన్నేండ్ల క్రితమే బ్రిడ్జీలు మంజూరైనా.. ఇప్పటికీ వాటి నిర్మాణం పూర్తి కాలేదు. దాంతో ప్రజలు ఇబ్బందులు తప్పట్లేదు.

బాబానగర్ నుంచి కోహిర్ మండలానికి వెళ్లే రోడ్డుకు మరమ్మతులు చేయాలని జిల్లా స్థాయిలో ఉద్యమం నిర్వహించిన విషయం తెలిసిందే. ఝరాసంగం మండలంలోని ఈదులపల్లి నుండి వెళ్లే రోడ్డుపై బ్రిడ్జి మంజూరై ఏండ్లు గడుస్తున్నా.. నేటికీ పనులు పూర్తికాలేదు. దాంతో వర్షాకాలం వచ్చిందంటే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు అక్కడికి వెళ్లి పరిశీలించి త్వరలోనే పనులు పూర్తి చేయాలని ఆదేశాలు ఇస్తున్నారే తప్పా.. పనులు మాత్రం జరగట్లేదు. అల్లిపూర్ నుంచి భరత్‌నగర్ మీదుగా అల్గోలు వెళ్లే రోడ్డుపై నాలుగేండ్ల క్రితం బ్రిడ్జీ మంజూరయింది. పనులు ప్రారంభమై రెండేండ్లు పూర్తవుతున్నా నేటికీ పూర్తికాలేదు. దాంతో స్థానికులు, వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. పలుమార్లు ప్రమదాలు కూడా జరిగిన ఘటనలు ఉన్నాయి. బ్రిడ్జి నిర్మాణం పేరుతో పక్కనుండి వేసిన రేవుపై అధికారులు కనీస జాగ్రత్తలు చేపట్టలేదు. దాంతో అది రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. చినుకు పడితే చాలు ద్విచక్ర వాహనాలు బురదలో ఇరుక్కుపోవాల్సిన దుస్థితి నెలకొంది. జహీరాబాద్ పట్టణంలోని అంగడి బజార్ నుంచి అల్గోల్ గ్రామానికి వెళ్లే రోడ్డుపై ఉన్న మట్కా నాలా బ్రిడ్జి కూడా కూలే దశకు చేరుకున్నది. దాంతో ప్రయాణికులు ఆ బ్రిడ్జిపై నుంచి వెళ్లాలంటే జంకుతున్నారు. జహీరాబాద్ నుంచి శాఖాపూర్ వెళ్లే రోడ్డుపై మోకాలు స్థాయికి గుంతలు ఏర్పడడంతో జిల్లా పరిషత్ సమావేశంలో సైతం ఈరోడ్డు గురించి ప్రజాప్ర తినిధులు తీవ్రస్థాయిలో చర్చలు జరిపి ఆర్అండ్‌బి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కానీ నేటికీ ఆ రోడ్డుపై గుంతలు అలానే దర్శనమిస్తున్నాయి. కాగా ఇప్పటికే రాత్రి సమయాల్లో గుంతల్లో పడి సుమారు 6 మంది ప్రాణాలను కోల్పోయారని పోలీస్ రికార్డుల ద్వారా తెలుస్తోంది. పర్వతా పూర్ రోడ్డుపై మంజూరైన మినీ బ్రిడ్జి నిర్మాణం పనులు పూర్తి చేయకపోవడంతో ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బ్రిడ్జీ కూలిపోవడంతో కాలు వ గుండా వెళ్లాల్సిన నీళ్ల వెళ్లక.. సుమారు 100 ఎకరాల్లో పంట నష్టం జరిగిన విషయం తెలిసిందే.

వామ్మో బీదర్ రోడ్డు..

జహీరాబాద్ పట్టణం నుంచి బీదర్ సరిహద్దు వరకు ఫోర్ వే రోడ్డు మంజూరై ఏండ్లు గడుస్తున్న నేటికీ రోడ్డు పనలు ప్రారంభం అవ్వలేదు. దాంతో పూర్తిగా దెబ్బతిన్న రోడ్ల గుండా బీదర్ వెళ్లాలంటేనే ప్రజలు జంకుతున్నారు. గతంలో ఎంపీగా ఉన్న బి.బి పాటిల్ జహీరాబాద్ నుంచి బీదర్ వరకు జాతీయ రహదారికి అనుసంధానం రోడ్డుగా ఫోర్ వే మంజూరు అయ్యి ంది. సర్వేలు కూడా నిర్వహించినట్టు పలు దఫాలుగా ప్రకటించారు. కానీ నేడు రోడ్డుపై మోకాలు స్థాయి గుంతలు పడడంతో ప్రయాణి కులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



కాంట్రాక్టర్లు ముందుకు రాకనే పనుల్లో జాప్యం

కాంట్రాక్టర్లు పోటీపడి తక్కువ ధరకు కోడ్ చేశారు. దాంతో పనులు ప్రారంభించకుండా ఏండ్లు గడుస్తున్నది. త్వరలోనే పనులు పూర్తిచేసేందుకు కృషి చేస్తున్నాం. ఇప్పటివరకు పూర్తయిన పనులకు బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు కొత్త పనులు ప్రారంభించడం లేదు.

– ఆర్అండ్‌బి డిప్యూటీ నర్సింలు



బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు సన్మానం

నవతెలంగాణ-న్యాల్‌కల్

రేజింతల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదేండ్లు పనిచేసి బదిలీపై వెళ్తున్న ఆరుగురు ఉపాధ్యాయులకు మంగళవారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సదరు ఉపాధ్యాయులు లాలయ్య, విటల్, నజీర్‌షరీఫ్, జ్యోతి, సవితబాయి, పుష్పలను ఘనంగా సన్మానించారు. హెచ్‌ఎం రఘునాథ్, ఏఏపీసీ చైర్మెన్ రామే శ్వరి, గ్రామ నాయకులు తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు వారిని శాలువా, పూలమాలలతో సత్కరించారు. అనంతరం హెచ్‌ఎం, చైర్మెన్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు చేసిన సేవ చిరస్థాయిగా నిలుస్తుందన్నారు.కార్యక్రమంలో గ్రామ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, బసయ్య స్వామి, యూనుస్, ఉపా ధ్యాయులు వెంకట్‌రెడ్డి, సంగమేశ్వర్, దేవిసింగ్,కృష్ణ ఉన్నారు.

నేడు కేతకీ ఆలయ పార్కింగ్ వేలం

నవతెలంగాణ-ఝరాసంగం

మండల కేంద్రమైన ఝరాసంగంలోని శ్రీ కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయ ఆవరణలో నేడు(బుధవారం) బహిరంగ పార్కింగ్‌కు వేలం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో శశిధర్ తెలిపారు. వేలం పాటలో పాల్గొనలను కునేవారు ముందస్తుగా రూ.50వేలు డిపాజిట్ చేయాలన్నారు. ఇతర వివరాలకు కార్యాలయంలో సంప్రాందించాలన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

- జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు
- లింగ నిర్ధారణ పరీక్షలకు పాల్పడితే లక్ష జరిమానా, ఐదేండ్ల వరకు జైలు శిక్ష

నవతెలంగాణ-సంగారెడ్డి



లింగ నిర్ధారణ పరీక్షలు జరిపితే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు హెచ్చరించారు. స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన లింగ నిర్ధారణ చట్టం పైన జిల్లాస్థాయి, మల్టిమెంబర్ కమిటీ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలో పిసి పిన్‌అండ్‌డిటి చట్టం అమలుపై సమీక్ష నిర్వహించారు. ఇప్పటివరకు 125 స్కానింగ్ సెంటర్స్ అనుమతిలో ఉన్నాయి, కొత్తవి 11 సెంటర్లు ఏర్పాటు కోసం దరఖాస్తు చేసుకున్నట్లు రెన్యువల్ కోసం 13 సెంటర్లు దరఖాస్తు చేసినట్లు డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ గాయత్రి దేవి తెలిపారు. లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని.. ఎవరైనా లింగ నిర్ధారణ చేస్తే.. మూడేండ్ల నుంచి ఐదేండ్ల వరకు జైలు శిక్ష, లక్ష రూపాయల వరకి జరిమానా పడుతుందని కలెక్టర్ తెలిపారు. ఎక్కడైనా లింగ నిర్ధారణ చేస్తే.. జిల్లా వైద్య శాఖాధికారికి తెలియచేయాలని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. దాని పర్యవేక్షణ కోసం జిల్లా కమిటీ సభ్యులతో టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేసి వివిధ స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేయాలని.. అలాగే డెకాయ్ ఆపరేషన్స్ చేయాలని డిఎంహెచ్వోను కలెక్టర్ ఆదేశించారు. ప్రజల్లో అవగాహనా కలిగించేందుకు హోర్డింగ్స్ ఏర్పాటు చేయాలని, ఈ ఆక్ట్‌పై అవగాహన కొరకు కళాశాలలో, ఆరోగ్య సిబ్బందికి, ఐసిడియస్ సిబ్బందికి డ్వాక్రా గ్రూప్, ఆరోగ్య మహిళా సంఘాలకు అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో పిసి పిన్ అండ్‌డిటి స్టిక్కర్స్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఎస్పీ రూపేష్, రెడ్ క్రాస్ చైర్మెన్ వనజరెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్ఓ డా.నాగ నిర్మల, పిఓఎం సీహెచ్ డా. మనోహర్ రెడ్డి, డెమో ప్రసాద్ వీర కుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.

గీతం అధ్యాపకుడికి డీఆర్డీవో పరిశోధనా ప్రాజెక్టు

నవతెలంగాణ-పటాన్‌చెరు



హైదరాబాద్‌లోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.దుర్గా భాస్కర్ యురు జాలకి రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్డీవో)లోని డైరెక్టరేట్ ఆఫ్ ఫ్యూచ రిస్టిక్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్(డీఎఫ్టీఎం) ప్రతిష్టాత్మక పరిశోధనా ప్రాజెక్టును మంజూరు చేసినట్టు మంగళవారం వెల్లడించారు. 'ఎన్-మిథెల్ పాలీ-3 వివెల్ టేట్రాబోల్ ఎనర్జిటిక్ బైండర్ ను కలిగి ఉన్న ఆక్సిరేన్ యొక్క సింథటిక్ మార్గం అభివృద్ధి' పేరిట చేపడుతున్న ఈ పరిశోధన ప్రాజెక్టు 30 నెలల వ్యవధిలో పూర్తిచేయాలని డీఎఫ్టీఎం వర్గాలు స్పష్టినించినట్టు తెలిపారు. డీఆర్డీవో ఇండస్ట్రీ అకాడెమియా సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ (డీఐఏ-సీవోఈ) యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ పథకం కింద ఈ పరిశోధనకు గాను రూ.42.90 లక్షల గ్రాంటును మంజూరు చేశారని, డాక్టర్ దుర్గా భాస్కర్ ఈ ప్రాజెక్టుకు ప్రధాన పరిశోధకుడిగా వ్యవహరిస్తారన్నారు. ఎమ్మెస్సీ (ఆర్గానిక్ కెమిస్ట్రీ)లో ప్రథమ శ్రేణి ఉత్తీర్ణంతో పాటు ఒక ఏడాది అనుభవం ఉన్న వారు ఈ ప్రాజెక్టులో ప్రాజెక్టు అసోసియేట్ (సీపీ)గా పనిచేయవచ్చని, వారికి నెలకు రూ.31వేలతో పాటు ఇంటి అద్దెతో ఫెలోసిస్ లభిస్తుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు మరింత సమాచారం కోసం డాక్టర్ దుర్గా భాస్కర్‌ను 94927 17834లో సంప్రదించాలని, లేదా byamajal@gitam.eduకు ఈ-మెయిల్ చేయాలని సూచించారు. డీఆర్డీవో నుంచి పరిశోధనా ప్రాజెక్టు పొందిన డాక్టర్ దుర్గాభాస్కర్ ను గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ఇన్ ఛార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రెజా తదితరులు అభినందించి, గడువులోగా పరిశోధనను పూర్తిచేయమని సలహా ఇచ్చినట్టు పేర్కొన్నారు.

అభివృద్ధికి నిరంతర కృషి..

నవతెలంగాణ-జిన్నారం



మండలం అభివృద్ధికి నిరంతర కృషి కొనసాగుతుందని జిన్నారం మాజీ ఎంపీపీ దమ్మగౌని రవీందర్ గౌడ్ అన్నారు. మండల పరిధిలోని శివనగర్ గ్రామంలో కొడకంచి మాజీ ఎంపీటీసీ బత్తుల సంతోషి మహేష్ నేతృత్వంలో మంగళవారం నిర్వహించిన కృతజ్ఞత సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్, మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షులు గంగు రమేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సో లక్ పల్లి మాజీ సర్పంచ్ దాసరి శ్రీకాంత్ రెడ్డి మాజీ ఎంపీటీసీలు బోరెడ జనాభాయి, బత్తుల సంతోషి మహేష్, కోరబోయిన నరేష్, కొడకంచి మాజీ ఉపసర్పంచ్ అభిలాష్‌గౌడ్, శివనగర్ మాజీ ఉప సర్పంచ్ ఫహీమ్‌లను సన్మానించారు. అనంతరం రవీందర్ గౌడ్, గంగు రమేష్ శ్రీకాంత్ రెడ్డిలు మాట్లాడుతూ.. శివనగర్‌తో పాటు అన్ని గ్రామాల ప్రభుత్వ అభివృద్ధి కృషి చేశామని ప్రజా ప్రతినిధులు పదవుల్లో ఉన్నా లేకపోయినా జిన్నారం మండలాభివృద్ధి కోసం నిరంతరం కృషి కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడువిర్నాల సత్యనారాయణ, వీరేష్, కుంచాల రమేష్, తీర్థలా కృష్ణ, బత్తుల మహేష్, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా అధ్యక్షులు విష్ణుమూర్తి చారి అంగన్వాడి, స్థానిక ఆరోగ్య ఉప కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఈఎస్ఐ హాస్పిటల్ ఏర్పాటుకు 12న 'ఛలో హైదరాబాద్'



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్‌లో ఈఎస్ఐ హాస్పిటల్ ఏర్పాటు కోసం ఈనెల 12న 'ఛలో హైదరాబాద్' చేపట్టి.. ఈఎస్ఐ డైరెక్టర్ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించనున్నామని.. ఈ ధర్నాలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ జహీరాబాద్ పారిశ్రామిక క్లస్టర్ కన్వీనర్ ఎస్. మహిపాల్ పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను జహీరాబాద్ పట్టణంలో మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మహిపాల్ మాట్లాడుతూ.. జహీరాబాద్ ప్రాంతం రోజు రోజుకూ అభివృద్ధి చెందుతుందని, ప్రత్యేకించి పరిశ్రమలు, కార్మికవర్గం పెరుగుతున్నదన్నారు. కాబట్టి స్థానికంగా 50పడల ఈఎస్ఐ హాస్పిటల్ అవసరమన్నారు. వెంటనే ప్రభుత్వం ఆసుపత్రిని నిర్మించాలన్నారు. జహీరాబాద్ ప్రాంతంలో సుమారుగా మూడు వేల మంది ఈఎస్ఐ కార్డు హోల్డర్స్ ఉండి, సుమారుగా రూ.23 నుంచి 25లక్షల రూపాయలు ఈఎస్ఐ బోర్డుకు వెళ్తున్నాయన్నారు. స్థానికంగా ఉన్న డిస్పెన్సరీలో కనీస సౌకర్యాలు కూడా లేవన్నారు. కాబట్టి ఇక్కడి కార్మికులకు న్యాయం జరిగేలా 50పడకల ఈఎస్ ఆసుపత్రిని నిర్మిం చాలన్నారు. తక్షణమే స్పందించాలని.. లేని యెడల సీఐటీ యూ ఆధ్వర్యంలో ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు.కార్యక్ర మంలో మహీంద్రా ట్రాక్టర్స్ ప్రధాన కార్యదర్శి గణేష్, మహీంద్రా అండ్‌మహీంద్రా నాయకులూ సూరి, క్రిష్టరెడ్డి, నాయకులు వంశీక్రిష్ణ, ఇస్మాయిల్, మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే మాణిక్‌రావు జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు జన్మదిన వేడుకలను క్యాంపు కార్యాలయంలో కార్యకర్తలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ మాజీ చైర్మెన్ అల్లాడి నర్సింలు, పార్టీ మండలాధ్యక్షులు తట్టు నారాయణ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ గుండప్ప యాదవుల సమక్షంలో కేక్‌కట్ చేసి సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జనహృదయ నేత, జహీరాబాద్ నియోజవర్గ అభివృద్ధి ప్రదాత మాణిక్‌రావు ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో కలకాలం జీవించాలని.. ప్రజలకు మరిన్ని సేవలను అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఆత్మ చైర్మన్ విజయ్‌కుమార్, మున్సిపల్ మాజీ చైర్మెన్ తంజిం, పాఆర్టీ ఝరాసంగం మండలాధ్యక్షులు వెంకటేశం, మాజీ పట్టణాధ్యక్షులు యాకూబ్,మాజీ మండల అధ్యక్షులు ప్రభు యాదవ్ సొసైటీ చైర్మన్ మచెందర్,మాజీ కౌన్సిలర్లు అబ్దుల్లా, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు బండి మోహన్, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీ తదితరులు పాల్గొన్నారు.

నేటి డిమాండ్స్ డేను జయప్రదం చేయాలి

సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు

నవతెలంగాణ-నారాయణకేడ్‌రూరల్



దేశవ్యాప్తంగా నేడు జరిగే డిమాండ్స్ డే(కోరికల దినం)లో పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కార్మికవర్గానికి సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు పిలుపునిచ్చారు. నారాయణఖేడ్ సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిమాండ్స్ డేకు సంబంధించిన కర పత్రాన్ని విడుదల చేశారు. అనంతరం సాయిలు మాట్లాడుతూ.. కేంద్ర బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని ప్రభుత్వ రంగ సంస్థలను, ప్రైవేటు సంస్థలకుకు అప్పజెప్పొద్దని, నేషనల్ మానిటైజేషన్ పైప్ లైన్‌ని రద్దు చేయాలన్నారు. బొగ్గు బ్లాకులను వేయడాన్ని నిలుపుదల చేయాలని, సింగరేణికి నేరుగా గనులు కేటాయించాలన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించా లన్నారు. ఆశా వర్కర్లకు పరీక్షలు రద్దు చేయా లన్నారు. కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలన్నారు. హమాలీ ట్రాన్స్ పోర్ట్ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఇలాంటి ఎన్నో సమస్యల పరిష్కారం కోరుతూ నేడు జరిగే డిమాండ్స్ డేలో పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాల న్నారు. ఈ కార్యక్రమంలో నారాయ ణఖేడ్ సీఐటీయూ బాధ్యులు రమేష్, జీపీ కార్మికులు రాజు, శంకర్, అంజి, సంజయ్, మున్సిపల్ వర్కర్స్ చంద్రకళ, శకుంతల, సుశీల మ్మ,లక్ష్మి, యేసు,రవి,ఆశా,అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

సొంత ఖర్చుతో కల్వర్టు నిర్మించిన కాంగ్రెస్ నాయకుడు





నవతెలంగాణ-పుల్కల్

పిల్ల కాలువ వల్ల రైతులు పొలాల వద్దకు వెళ్లలేక ఇబ్బంది పడుతుండటాన్ని గమనించి.. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బోయిని శ్రీనివాస్ తన సొంత ఖర్చుతో కల్వర్టు నిర్మించారు. దాంతో స్థానిక రైతులు హర్షం వ్యక్తం చేశారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని ముద్దాయిపేట, పుల్కల్ గ్రామాలకు చెందిన సుమారు 30 మంది రైతులు పంట పొలాలకు వెళ్లే దారిలో సింగూరు ఎడమ కాలువ ద్వారా వచ్చిన పిల్ల కాలువ అడ్డం ఉండేది. దాంతో ఆ రైతు లు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వచ్చేది. గత ప్రభుత్వంలోనూ ఈ సమస్య గురించి ఎవరూ పట్టించుకోలేదు. కాగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బోయిని శ్రీనివాస్ తన సొంత ఖర్చులతో మంగళవారం రోజున క్రేన్ సాయంతో పెద్ద కాలువలో ఉన్న పైపును తీసి.. పిల్ల కాలువలో వేసి అక్కడి రైతులకు రహదారి కల్పించారు.దాంతో స్థానిక రైతులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం బోయిని శ్రీనివాస్ మాట్లా డుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికే ఎల్లవేళలా కృషి చేస్తున్నదన్నారు. స్థానిక మంత్రి దామోదర రాజ నర్సింహా సహకారంతో మండలాన్ని అని విధాల అభివృద్ధి చేస్తామన్నారు.

రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

నవతెలంగాణ-సంగారెడ్డి



ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలన్నింటినీ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ.. సంగారెడ్డి భారతీయ జనతా కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ ఆఫీస్ ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షులు ద్వారకా రవి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కమిటీల పేరుతో రైతులను మోసం చేస్తున్నదన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల రోజులు పైబడినా.. రైతు భరోసా పేరుతో ఇచ్చిన హామీని నెరవేర్చలేక పోవడం దురదృష్టకరమన్నారు. మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా కాకుండా సబ్ కమిటీలు అభిప్రాయాల పేరుతో కాలయాపన చేయడం విడ్డూరమన్నారు. ఇప్పటికైనా స్పందించి.. హామీలన్నింటినీ అమలు చేయాలన్నారు. లేని యెడల రైతులను సంఘటిత పరిచి ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యాలయ కార్యదర్శి విజయకుమార్, విష్ణువర్ధన్ రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షులు నాగరాజు, పట్టణ ప్రధాన కార్యదర్శులు శివ, అజయ్, పట్టణ కార్యదర్శి పట్టణ కిసాన్ మోర్చా అధ్యక్షులు లింగమూర్తి ,శరత్, సతీష్, రాము, దుర్గయ్య పోలీస్ శేఖర్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

శివసేన రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన మల్లికార్జున్

నవతెలంగాణ-జహీరాబాద్



రాష్ట్ర స్పోర్ట్స్ అథరటి చైర్మెన్‌గా నియమితులైన యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు శివసేనారెడ్డిని యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ముల్గి మల్లికార్జున్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. స్పోర్ట్స్ నిర్వహణలో జహీరాబాద్ ముందంజలో ఉందని.. జహీరాబాద్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో ఆర్డినేటర్ శివసాయి, జిల్లా నాయకులు శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇండ్ల పట్టాలు ఇవ్వాలి

- మండల విలేకరులు

నవతెలంగాణ - నిజాంపేట



నిజాంపేట మండల కేంద్రంలో విలేకరులకు ఇండ్ల స్థలాల పట్టా సర్టిఫికెట్లను మంజూరు చేయాలని మండలానికి చెందిన విలేకరులు మల్కాజ్గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతనంగా నిజాంపేట మండలాన్ని ఏర్పాటు చేసినప్పటి నుంచి పత్రిక రంగంలో పనిచేస్తున్న మాకు ఇండ్ల పట్టా సర్టిఫికెట్లను మంజూరు చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు హనుమంతరావుకు వినతిపత్రం అందజేశామన్నారు. అందుకు వారు స్పందిస్తూ ఇండ్ల స్థలాల పట్టా సర్టిఫికెట్లను వెంటనే కలెక్టర్ తో మాట్లాడి ఇప్పిస్తాననిహామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో నవ తెలంగాణ రిపోర్టర్ బండారి చంద్రయ్య , ఆంధ్రప్రభ రిపోర్టర్ జీడి చంద్రకాంత్ గౌడ్, ప్రజా పక్షం రిపోర్టర్ దుబసి సంజీవ్, నమస్తే తెలంగణా సిద్ధరాములు, వీ6 స్వామి, సాక్షి భరత్ రెడ్డి, బాల్ రాజు, ఆంధ్రజ్యోతి అజ్జర్, దిశ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వన మహోత్సవం కార్యక్రమం

నవతెలంగాణ-పాపన్నపేట



పాపన్నపేట మండలం పరిధి లోని గాజులగూడెం ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఘనంగా వనమహోత్సవం కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాయిసిరి, చెట్ల యొక్క ప్రాముఖ్యత ,మొక్కలు నాటకుంటే మనుషులు ఎదుర్కొనే కష్టనష్టాల గురించి విద్యార్థులకు పాట రూపంలో పాడించి వివరించారు .విద్యార్థుల వృక్షాకృతి గ్రామస్తులు అందరి నీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీందర్ , వేణుగోపాల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అందుబాటులోకి స్మశానవాటిక

నవతెలంగాణ-నిజాంపేట



మండల కేంద్రంలోని స్మశానవాటికను గ్రామ ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తున్నామని తాహసీల్దార్, గ్రామ ప్రత్యేక అధికారి సురేష్ కుమార్ అన్నారు. ఈ సందర్భ గా ఆయన మాట్లాడుతూ గ్రామంలో నూతనంగా నిర్మించబడిన స్మశానవాటిక పనులు పూర్తయ్యాయని త్వరలోనే ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా వైకుంఠధామంలో నీటి సౌకర్యం కోసం పైప్‌లైన్ పనులను పూర్తి చేస్తామన్నారు. స్మశానవాటిక ఇరువైపులా చెట్ల మొక్కలు నాటిస్తున్నామనని త్వరలో దహన సంస్కారాలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.గ్రామ కార్యదర్శి నర్సింలు, కారోబార్ కొండల్ రెడ్డి, పారిశుద్ధ కార్మికులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులుకు ఘనంగా వీడ్కోలు

- విద్యార్థులు ఉన్నత స్థానానికి చేరినప్పుడే ఉపాధ్యాయునికి గుర్తింపు
- మండల నోడల్ ఆఫీసర్ నీరజ

నవతెలంగాణ-చేగుంట



చేగుంట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల బదిలీపై వెళ్లిన చక్రధర్ శర్మ లలిత, శంకర్‌సింగ్ రాథోడ్, ఈశ్వరయ్యలకు వీడ్కోలు పలుకుతూ ఘన సన్మానం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి చేగుంట మండల నోడల్ ఆఫీసర్ నీరజ మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత స్థాయిలో ఉన్నప్పుడు మాత్రమే ఉపాధ్యాయులకు సంతృప్తి ఉంటుందన్నారు. వివేకానందుడు గొప్పవాడు కాబట్టే రామకృష్ణ పరమహంసగా పేరు వచ్చింది. విద్యార్థులు క్రమశిక్షణగా ఉండి విద్యను అభ్యసించిన మాత్రమే విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదుగుతారని వారన్నారు. ఈ కార్యక్రమంలో చల్లా లక్ష్మణ్, మనోహర్ రావు, వెంకటేష్, రాజేశ్వర్, సురేందర్, రాధ, రేఖ, సరస్వతి, రమ, శ్రీవాణి,భవాని,రమాదేవి, సుధాకర్ రెడ్డి, రఘుపతి, సిఆర్పి రమేష్ పాల్గొన్నారు.

తెలంగాణకు తొలి శని 'కేసీఆర్'..

- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ఘాటు వ్యాఖ్యలు

నవతెలంగాణ- గజ్వేల్



తెలంగాణ రాష్ట్రానికి తొలి శని గాళ్లు కేసీఆర్, ఆయన కుటుంబమని మెదక్ పార్లమెంటు సభ్యులు రఘునందన్ రావు విమర్శించారు. మంగళవారం గజ్వేల్‌లో రఘునందన్ రావుకు బీజేపీ నాయకులు కృతజ్ఞత సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ రాజ్యాంగానికి కూనిచేసి ఎమ్మెల్యేలను కొనుగోలు చేసిన చరిత్ర కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులకు ఉందన్నారు. అలాంటి వ్యక్తులు కాంగ్రెస్ పార్టీలో కండువలు మార్చుకుంటున్న బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు విషయంలో రాజ్యాంగం గురించి మాట్లాడడం సిగ్గుచేటన్నారు. స్పీకర్ సురేష్ రెడ్డిని అడ్డం పెట్టుకొని అడ్డమైన పనులు చేసిన విషయాన్ని కేటీఆర్, హరీశ్ రావు, కేసీఆర్ మర్చిపోవడం విడ్డూరంగా ఉందన్నారు. గజ్వేల్ నుంచి ఢిల్లీ పార్లమెంట్ భవనం వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వరకు కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు ముక్కు నేలకు రాయాలని అయినా తెలంగాణ ప్రజలు మిమ్ములను క్షమించే ప్రసక్తే లేదన్నారు. బీఆర్ఎస్ పార్టీ శాసనసభ పక్షం కాంగ్రెస్లో విలీనం ఖాయమవుతుందని అన్నారు. గతంలో కేసీఆర్ చేసిన పని రేవంత్ రెడ్డి చేస్తున్నారని అన్నారు. తెలంగాణలో ఉన్న ఒక సామెత ముంగటి నాగలి సక్రమంగా వెళ్తే వెనుక నాగలి కూడా అదే దారిలో వెళ్తుందని అన్నారు.పార్టీ ఫిరాయింపుల పెద్దపీట వేసింది కాంగ్రెస్ పార్టీ అన్నారు. సిరిసిల్ల, సిద్దిపేటలో బావా బామ్మర్దులను తరిమికొట్టేలా చేస్తామని ఆయన అన్నారు. అమరవీరుల త్యాగాల పై ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రాన్ని దోచుకున్న కేసీఆర్ కుటుంబాన్ని తెలంగాణ ప్రజల ఉసురు తగులుతుందన్నారు.తెలంగాణ అమరుడు శ్రీకాంత్ చారి తల్లి శంకరమ్మకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చామని వాట్సాప్ గ్రూపులో సోషల్ మీడియాలో హల్చల్ చేసి మోసం చేసిన ఘనత కేటీఆర్ కే దక్కిందన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో గజ్వేల్ నియోజకవర్గ ప్రజలు వైపు నిలబడడం వచ్చే అన్ని ఎన్నికల్లో బిజెపి జెండాను గజ్వేల్ గడ్డపై ఎగరవేస్తామన్నారు. కార్యకర్తలు సైనికులుగా పనిచేశారని వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు మోహన్ రెడ్డి, పార్టీ నాయకులు రామ్ రెడ్డి, సింగం సత్తయ్య, రాంప్రసాదరావు, వెంకటరమణ, నందా గౌడ్, నరేష్ బాబు, గురువారెడ్డి, నల్లమల శ్రీనివాస్, మహేష్, మనోహర్ యాదవ్, సురేష్, అశోక్ గౌడ్, అరవింద్, ఐల మహేందర్, ఉప్పల మధు, పేర్ల శ్రీనివాస్, నత్తి మల్లేశం, బిజెపి మహిళ సభ్యులు సరిత, మమత, భాగ్యలక్ష్మి, రాణి, వినోద తోపాటుఎమ్మార్పీఎస్ నాయకులు మైసరాములు, కృష్ణ పాల్గొన్నారు

ఇద్దరి రైతుల మధ్య గెట్టు వివాదం

- కట్టేసి కర్రతో చితకబాదిన యువకుడు
- బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం ఏఎస్ఐ

నవతెలంగాణ-కొల్చారం




ఇద్దరి రైతుల మధ్య గెట్టు వివాదం చోటు చేసుకుని కర్రలతో తీవ్రంగా కొట్టుకుని గాయపడిన ఘటన కొల్చారం మండలం సంగాయిపేటలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. కొల్చారం ఏఎస్ఐ తారాసింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. సంగాయిపేట గ్రామానికి చెందిన మొకిరె మల్లయ్య, జెల్ల మల్లయ్య అనే ఇద్దరి రైతులకు మెదక్- సంగారెడ్డి ప్రధాన రహదారిని ఆనుకుని సంగాయిపేట వద్ద వ్యవసాయ పొలం ఉంది. ఇద్దరి మధ్య గెట్టు వివాదం జరగడంతో కర్రలతో కొట్టుకున్నారు. ఈ విషయం ఫోన్ ద్వారా తెలుసుకున్న ఇద్దరి రైతుల కుమారులు జెల్ల బాలు, మొకిరె నర్సింహులు ఇద్దరు ఘటన స్థలానికి చేరుకున్నారు. గాయపడిన ఇద్దిని సముదాయించి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అంతలోనే క్షణికావేశంలో జెల్ల మల్లయ్య కుమారుడు బాలు మొకిరె మల్లయ్య కుమారుడైన నర్సింహులును తమ పొలం పక్కనే ఉన్న భవనం ముందు ఫాస్ట్ ఫుడ్ సెంటర్ రేకుల షెడ్డుకు తాళ్లతో కట్టేసి కర్రతో తీవ్రంగా కొట్టడాన్ని గమనించిన ఇరుగు పొరుగు వారు అడ్డుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న ఏఎస్ఐ తారాసింగ్ సిబ్బందితో అక్కడికి చేరుకుని దాడికి పాల్పడిన యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. అలాగే దాడికి వినియోగించిన కర్రను, తాళ్లను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఈ ఘటనపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ధ్రువీకరణ పత్రాల పరిశీలన

- కళాశాల ప్రిన్సిపాల్

నవతెలంగాణ -నంగునూరు



నంగునూరు మండలం రాజగోపాలపేట పాలిటెక్నిక్ కళాశాలలో ఇంజనీరింగ్ ప్రవేశాల కొరకు ధ్రువీకరణ పత్రాల పరిశీలన కొనసాగుతున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ సూర్య నారాయణ తెలిపారు. నేటి వరకు సర్టిఫికెట్ పరిశీలన కొనసాగుతుందని చెప్పారు. మంగళవారం నిర్వహించిన కౌన్సెలింగ్‌కు ఎంసెట్ 216 మంది, పాలిసెట్ రెండో విడత కు 52 మంది హాజరయ్యారు. నితిన్ పవార్, మాణిక్యం,సీహెచ్.శ్రీనివాస్, రాజు, సంధ్యా రాణి, కవిత, జ్యోతి, విజయ్ కుమార్, శ్రీనివాస్, రాజమౌళి, స్వామి, వాణి తదితరులు సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేశారు.

డీఎస్పీ నూతన మండలాధ్యక్షుడిగా సురేశ్

నవతెలంగాణ-బెజ్జంకి



ధర్మ సమాజ్ పార్టీ నూతన మండలాధ్యక్షుడిగా మండల పరిధిలోని కల్లేపల్లి గ్రామానికి చెందిన మహంకాళి సురేశ్ ఎన్నికైనట్టు జిల్లాధ్యక్షుడు బోయిని సదన్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన డీఎస్పీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో నూతన మండలాధ్యక్షుడి ఎన్నిక నిర్వహించామని సదన్ కుమార్ తెలిపారు.

4వ రోజుకు చేరిన అంగన్వాడీల దీక్ష

నవతెలంగాణ-మెదక్‌టౌన్



అంగన్వాడీలు చేస్తున్న నిరాహార దీక్షలు 4 వ రోజుకు చేరుకున్నది. ఈ సందర్భంగా ఐసీడీఎస్ పీడీ బ్రాహ్మజీ కి వినతి పత్రం అందజేశారు. అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి కె నర్సమ్మ మాట్లాడుతూ ప్రభుత్వం జీవో నెంబర్ 10 తెచ్చి అంగన్వాడీ టీచర్లకు రూ. లక్ష , హెల్పర్లకు రూ.50 వేలు ఇస్తామని హామీనిస్తే దానికి వ్యతిరేకంగా కేసీఆర్ ప్రభుత్వం హాయంలో అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు పెద్ద ఎత్తున రాష్ట్రవ్యాప్తంగా 24 రోజులు నిరవధిక సమ్మె చేయగా కేసీఆర్ ప్రభుత్వం జీవో నెంబర్ 10 రద్దు చేస్తామని, టీచర్లకు రూ. రెండు లక్షలు , హెల్పర్లకు రూ.లక్ష రిటర్మెంట్ బెన్ పిట్ ఇస్తామని, వాలంటరీ రిటైర్మెంట్ స్కీమును ఏర్పాటు చేస్తామని, చివరి జీవితంలో సగం పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చారు. అట్టి హామీలు అమలు చేయకపోగా నేటి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి ప్రభుత్వం పాత ప్రభుత్వం కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన జీవోను యధాతథంగా అమలు చేస్తామని టీచర్లకు రూ.లక్ష , హెల్పర్లకు రూ. 50 వేలు ఇస్తామని ప్రకటించడం పుండు మీద కారం చల్లినట్టుగా ఉందన్నారు. జూలై 8వ తేదీన తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐ టీయు)జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు అంగన్వాడీ టీచర్లకు రిటర్మెంట్ బెన్ పిట్ రెండు లక్షలు ఇవ్వాలని, హెల్పర్లకు రూ. లక్ష ఇవ్వాలని, రిలే నిరాహార దీక్షలు 3వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు పుట్ట ఆంజనేయులు పాల్గొని ప్రసంగిస్తూ రిలే నిరాహార దీక్షలు ప్రభుత్వం జీవో నెంబర్ 10 తెచ్చి అంగన్వాడీ టీచర్లకు రూ. లక్ష హెల్పర్లకు రూ.50 వేలు ఇస్తామని హామీనిస్తే దానికి వ్యతిరేకంగా కేసీఆర్ ప్రభుత్వం హాయంలో అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు పెద్ద ఎత్తున రాష్ట్రవ్యాప్తంగా 24 రోజులు నిరవధిక సమ్మె చేయగా కేసీఆర్ ప్రభుత్వం జీవో నెంబర్ 10 రద్దు చేస్తామని, టీచర్లకు రూ.రెండు లక్షలు రిటర్మెంట్ బెనిఫిట్ ఇస్తామని, హెల్పర్లకు రూ. లక్ష రిటర్మెంట్ బెన్ పిట్ ఇస్తామని, వాలంటరీ రిటైర్మెంట్ స్కీమును ఏర్పాటు చేస్తామని, చివరి జీవితంలో సగం పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చారు. అట్టి హామీలు అమలు చేయకపోగా నేటి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి ప్రభుత్వం పాత ప్రభుత్వం కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన జీవోను యధాతథంగా అమలు చేస్తామని టీచర్లకు రూ.లక్ష , హెల్పర్లకు రూ.50 వేలు ఇస్తామని ప్రకటించడం పుండు మీద కారం చల్లినట్టుగా ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచించి జీవో నెంబర్ 10 రద్దుచేసి అంగన్వాడి టీచర్లకు రిటర్మెంట్ బెనిఫిట్ రూ. రెండు లక్షలు ఇవ్వాలని, హెల్పర్లకు రూ.లక్ష ఇవ్వాలని, వారి కుటుంబంలో వారి వారసులకు ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, వాలంటరీ రిటైర్మెంట్ స్కీమును తేవాలని, చివరి జీతంలో సగం పెన్షన్ ఇవ్వా లని డిమండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్మెంట్ అయిన హెల్పర్లు పాల్గొన్నారు.

అరచేతిలో ప్రాణాలు..

వేలాడుతూ ప్రయాణాలు..

నవతెలంగాణ-తూప్రాన్



ఆర్టీసీ బస్సుల్లో ఉదయ పూట సాధారణ ప్రయాణికులతో పాటు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులతో పాటు ప్రభుత్వ, ప్రయివేటు ఉద్యోగులు బస్సు ప్రయాణం ద్వారా తమ తమ విధులకు చేరుకోవాల్సి ఉంటుంది. బస్సుల్లో ప్రయాణికుల రద్దీ ఎక్కువ అవ్వడంతో తమ ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సి వస్తుందని ప్రయాణికులు వాపోతున్నారు. చెయ్యి, కాలు జారిన తమ ప్రాణాలు గాల్లో కలిసినట్టే అని భయపడుతున్నారు. ప్రతిరోజు బస్సు ప్రయాణం చేసేవారు ప్రయాణికుల రద్దీతో ఎప్పుడు ఏం జరుగుతుందో అని ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఫ్రీ బస్సు ప్రయాణం ప్రకటించడంతో ప్రయాణికుల రద్దీ ఎక్కువైంది. బస్సు ఉచిత ప్రయాణంతో మహిళల బస్సు ప్రయాణం ఎక్కువైందని ప్రయాణికులు అంటున్నారు.. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులకు కూడా ఈ బస్సు ప్రయాణ సౌకర్యం అసౌకర్యంగా మారిందన్నారు. గత ప్రభుత్వం 317 జీవో ద్వారా ఉద్యోగులను బదిలీ చేయడంతో, ఉద్యోగులు దూర ప్రయాణాలు ఆర్టీసీ బస్సుల్లో చేయాల్సి వస్తుంది. సంగారెడ్డి నుంచి తూప్రాన్, గజ్వేల్ వరకు గజ్వేల్,తూప్రాన్ నుండి సంగారెడ్డి వరకు బస్సుల్లో ప్రయాణం చేసే ఉద్యోగుల అవస్తులు ఎక్కువయ్యాయని అభిప్రాయ పడుతున్నారు.ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించుటకు రాష్ట్ర ప్రభుత్వం పరిష్కార మార్గాలను చూపాల న్నారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయా ణించే ప్రయాణికులు ఎల్లప్పుడూ ప్రభుత్వానికి అండగా ఉంటామన్నారు. ఆర్టీసీ అభివృద్ధికి ప్రయాణికుల మద్దతు దోహదం చేస్తుందన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరిస్తుందని ఆశిస్తున్నారు.

ప్రత్యేక పూజలు చేసిన మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-నిజాంపేట్



నిజాంపేట్ మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో మంగళవారం రోజున మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు గ్రామంలోని హనుమాన్ దేవాలయంలో ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం గ్రామంలోని ప్రైమరీ స్కూలును సందర్శించి మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. రాంపూర్ గ్రామస్తుల వారి సమస్యలను అడిగి తెలుసుకుని త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. నిజాంపేట గ్రామానికి చెందిన తాడెం సాయికుమార్ మంజూరైన రూ.మూడు లక్షల ఎల్ఓసీని అందజేశారు. ఆ కుటుంబానికి ఇంకేమైనా ఆర్థిక భరోసా కల్పిస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్ గౌడ్ తండ్రిని పరామర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఏ గ్రామంలో నీటి సమస్య ఉన్న నెల రోజులలో స్థానిక ఎమ్మెల్యే వచ్చి నీటి సమస్య తీరుస్తారని తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు ఏ సమస్య ఉన్న వారికి అందుబాటులో వుండి సమస్యల పరిష్కార దిశగా ముందుంటానని అన్నారు. వచ్చేనెల మొదటి రోజు నుంచి రైతులకు రైతు భరోసా కింద రుణమాఫీ పూర్తి చేస్తామన్నారు. ఎమ్మెల్యే ఎన్నికలు పూర్తి అయిన తర్వాత మండలానికి రూ. కోటి 80లక్షల మంజూరు చేశామని ఆ పనులు కూడా పూర్తయ్యాయని మళ్లీ నియోజకవర్గానికి రూ.20 కోట మంజూరు అవుతున్నాయని అన్నారు. మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు మారుతి, మాజీ ఎంపీపీ సిద్దరాములు, పంజా మహేందర్, యాదగిరి, నసిరుద్దీన్, వెంకటేష్ గౌడ్, చెప్పటం ముత్యం రెడ్డి, అమర సేనా రెడ్డి , నరసింహారెడ్డి ,సత్యనారాయణ రెడ్డి, మోహన్ రెడ్డి, వెంకటాపూర్ మధుసూదన్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, అందే స్వామి, రవీందర్ రెడ్డి, రమావత్ వినోద్, శ్రీనివాస్ రామావత్, ఆకుల బాలయ్య చిన్న అంజాగౌడ్, జేల్లా లక్ష్మణ, భూమా గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో సమస్యలను పరిష్కరించాలి

- కొండల్ రెడ్డి

నవ తెలంగాణ- మెదక్ టౌన్



మెదక్ జిల్లా కేంద్రంలోని పలు సమస్యల పరిష్కారానికై పాటుపడాలని మెదక్ కమిషనర్ జానకిరామ్ సాగర్‌కు మంగళవారం మెదక్ సిటిజన్ ఫోరం అధ్యక్షులు కొండల్ రెడ్డి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కొండల్ రెడ్డి మాట్లాడుతూ వర్షాకాలం సందర్భంగా పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురికాకుండా నీరు నిల్వ లేకుండా మోరీలు పరిశుభ్రంగా చేయాలని ఆయన తెలిపారు. ముఖ్యంగా ముఖ్యంగా గుంతలుగా ఉన్న రహదారులన్నిటిని సురక్షితంగా ప్రయాణించేందుకు రహదారులను తీర్చిదిద్దాలని తెలిపారు. అన్ని కాలనీలలో మంచినీటి సరఫరా చేయాలని మిషన్ భగీరథ ద్వారా మంచిదేటిని అందించాలని బోరు ద్వారా అందించే నీటిని వేరువేరుగా అందించాలని తెలిపారు. పట్టణానికి మంచినీటిని సరిపడా చేసే పంప్ హౌస్ వద్ద మురికి నీరు కలవకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. పట్టణములో గల అన్ని స్మశాన వాటికలతో అన్ని రకాల సదుపాయాలను ఏర్పాటు చేయాలని, చిల్డ్రన్ పార్కులను అందుబాటులో తీసుకురావాలని డబుల్ బెడ్ రూమ్ వద్ద మౌలిక వసతులు కల్పించాలని, పట్టణంలో పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయాలన్నారు. స్థానిక జూనియర్ కళాశాలలో వాకర్స్ కు లైట్లను ఏర్పాటు చేయాలని పలు సమస్యలను లేఖ ద్వారా మున్సిపల్ కమిషనర్ జానకిరామ్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిటిజన్ ఫోరం సభ్యులు పిడి ఆనందం, యాజం నాగభూషణం, జీవరత్నం, బాలేశ్వర్ గౌడ్, నరహరి, దయాసాగర్, నాగరాజు తదితరులు ఉన్నారు.

వైభవంగా రేణుక ఎల్లమ్మకు బోనాలు

- బోనమెత్తిన నర్సాపూర్ కాంగ్రెస్ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి

నవతెలంగాణ-వెల్దుర్తి



వెల్దుర్తి మండలంలో ప్రతి ఏటా ఆషాడ మాసంలో రెండు రోజుల పాటు జరిగే బోనాల ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రెండో రోజు రేణుక ఎల్లమ్మకు బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో నరసాపూర్ కాంగ్రెస్ ఇంచార్జి ఆవుల రాజిరెడ్డి, రాష్ట్ర మహిళ నాయకురాలు సువాసి రెడ్డి, జిల్లా నాయకుడు నరేందర్ రెడ్డి పాల్గొని బోనం ఎత్తారు. వేదమంత్రాలు ఊరేగింపులు శివసత్తులు పోతరాజుల నృత్యాలతో రేణుక ఎల్లమ్మ అమ్మవారికి ఆలయంలో బోనాల వేడుక అంగరంగ వైభవంగా కొనసాగింది. ఈ సందర్భంగా నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి మాట్లాడూతూ.. ఈ ఏడాది అమ్మవారి దయవలన వర్షాలు సమృద్ధిగా కురిసి పాడ పంటలతో ప్రజలంతా సుఖ సంతోషాలతో తులతూ గాలని కోరుకుం టున్నాను అన్నారు. వర్షాకా లంలో తలెత్తే సీజన్ వ్యాధులు మానవుల వద్దకు దరిచేరకుండా అమ్మవారి కటాక్షం మెండుగా ఉంటుందని కోరుకుం టున్నాను అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేష్ రెడ్డి సుధాకర్ గౌడ్ నరసింహారెడ్డి తల్లారి మల్లేష్ తోపాటు మరికొంతమంది ఉన్నారు.

ఆత్మహత్య కారకులకు జైలుశిక్ష

- వెల్దుర్తి ఎస్ఐ నవత గౌడ్

నవతెలంగాణ -వెల్దుర్తి



వెల్దుర్తి మండల పరిదిల్లో చేరిలా గ్రామానికి చెందిన కౌడి పావని ఆత్మహత్య చేసుకొని బలస్మరణం చెందడానికి కారణమైన ఇద్దరు మహిళలను జైలుకు పంపామని ఎస్ఐ నవత గౌడ్ తెలిపారు.వివరాల ప్రకారం....చేరిలా గ్రామానికి చెందిన కౌడి యాదమ్మ, శ్రీనివాస్ దంపతుల కుమార్తె కౌడి పావని, మేనత్త మంజుల, నాయనమ్మ బాలమణి భూమి అమ్మగా వచ్చిన డబ్బుల కోసం తగాదాలు తారస్థాయికి చేరుకోవడంతో కౌడి పావనిని నానా బూతులు తిడుతూ నీవు తప్పకుండా చనిపోవాలి అనే మాటలు తట్టుకోలేక పావని మే 22న ఆత్మహత్య చేసుకుంది. దానికి కారణమైన మేనత్త మంజుల నాయనమ్మ బలమని పై తండ్రి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి జైలుకు పంపామని మంగళవారం ఎస్సై నవత గౌడ్ తెలిపారు. చావుకు కారణమైన మంజుల, బాలమణి ఇద్దరు మహిళలను చట్టాన్ని అతిక్రమించి విపరీతంగా కొట్టారని చేపూరి రమేష్ మెదక్ మండలం రాజు పల్లి గ్రామం, కురుమ మైపాల్ మీర్జాపల్లి గ్రామం శంకరంపేట మండలం, కౌడి యాదగిరి, కౌడి కొమురయ్య, కౌడి చిన్న మల్లయ్య, వెల్దుర్తి మండలం చేరిల గ్రామం చెందిన మంజుల, బాలమణి వ్యక్తులపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి జైలుకు పంపడం జరిగిందని ఎస్ఐ నవత గౌడ్ తెలిపారు.

ప్రశాంత వాతావరణంలో పండగలు జరపాలి

నవతెలంగాణ-టేక్మాల్



పండగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నిమ్మ రమేష్ అన్నారు. మంగళవారం టేక్మాల్ పోలీస్ స్టేషన్ ఆవరణంలో ఎస్ఐ మురళి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పీస్ కమిటీ, సమావేశంలో ఆయన మాట్లాడూతూ.. తెలంగాణ ప్రాంతంలో ప్రజలు కులమత భేదాలకు తావివ్వకుండా ఆనంద ఉత్సవాలతో పండగలను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. కొన్ని పార్టీలు తమ పదం కడుక్కోవడానికి మతాలను తెరపైకి తీసుకువచ్చి ప్రజల మధ్యన చిచ్చు పెట్టడం మంచి పద్ధతి కాదన్నారు. మత రాజకీయాలు దేశ భవిష్యత్తుకు విచ్ఛిన్నకారాణాలుగా ఉంటాయి. తప్ప అభివృద్ధికి సోపానాలుగా నిలవవు అని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షు లు భక్తుల వీరప్ప, జిల్లా మైనార్టీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ మజ్జహర్, కాంగ్రెస్ పార్టీ సీని యర్ నాయ కులు భక్తు ల కిషోర్, మైనార్టీ హక్కుల పరిరక్షణ జిల్లా కార్యదర్శి ఎంఎస్ అలీ, సిద్దన్న, మహేందర్ తదితరులు ఉన్నారు.

లారీ ఢీ.. వ్యక్తి మృతి

నవతెలంగాణ - తూప్రాన్



లారీ ఢీకొట్టడంతో వ్యక్తి మృతి చెందినాడు. ఈ సంఘటన తూప్రాన్ మండలం నాగులపల్లి గ్రామానికి చెందిన జైపాల్ రెడ్డి (45), కలకత్తాకు చెందిన శంభు మండల్ (32), మరో వ్యక్తి తో కలిసి ముగ్గురు బైక్ పై చేగుంట మండలం వడియారం శివారులో ఉన్న రామంతాపూర్ తాండావైపు వెళ్లే మార్గంలో ప్రయాణం చేస్తుండగా, అకస్మాత్తుగా వచ్చిన లారీ ఢీకొట్టడంతో జయపాల్ రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో గాయపడ్డ శంభు మండల్ కలకత్తాకు చెందిన వ్యక్తిని హైదరాబాద్ హాస్పిటల్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించారు.మరో వ్యక్తి గాయాలతో హాస్పిటల్లో చేరాడు.తూప్రాన్ మండలం నాగులపల్లి గ్రామానికి చెందిన జయపాల్ రెడ్డికి భార్య లావణ్య తో పాటు ఒక కూతురు,కుమారుడు ఉన్నారు. ఉదయం సమయంలో అకస్మాత్తుగా ప్రమాదంలో మరణించడంతో నాగులపల్లి గ్రామంలో విషయాలు అలుముకున్నాయి. బీజేపీ పార్టీ బూత్ అధ్యక్షులుగా జయపాల్ రెడ్డి పనిచేస్తున్నారు.కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని ప్రమాదస్థలం నుంచి ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించి, కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

మొక్కలు నాటిన బీజేపీ నాయకులు

నవతెలంగాణ- నిజాంపేట



మండల కేంద్రంలోని పెద్ద ఆలయ ఆవరణలో బీజేపీ మెదక్ నియోజకవర్గ అసెంబ్లీ ఇంచార్జి మాజీ జెడ్పీటీసీ పంజా విజయ్ కుమార్ ఆధ్వర్యంలో చెట్ల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ కార్యవర్గ పిలుపుమేరకు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి ఉత్సవాల్లో భాగంగా దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పిలుపుమేరకు, అమ్మ కోసం ఒక చెట్టు కార్యక్రమంలో భాగంగా చెట్ల మొక్కలు నాటరన్నారు. మానవుని జీవన మనుగడకు చెట్లు ఎంతో ముఖ్యమని చెట్ల మొక్కలను నాటి వాటిని సంరక్షించుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ పార్టీ సీనియర్ నాయకులు నవాత్ రాజేంద్రప్రసాద్, నార్లపూర్ మాజీ ఎంపీటీసీ రాజిరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ సంజీవ్, సిద్ధరాం రెడ్డి, నీలం తిరుపతి, జాల పోచయ్య రాజిరెడ్డి, చంద్రశేఖర్, జీపీ స్వామి, పంజా బాబు, భానుచందర్, రమేష్, తిరుపతిగౌడ్, చీకోటి వెంకటేశం, శనగపల్లి తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు సన్మానం

నవతెలంగాణ-హవేలి ఘనాపూర్



హవేలీ ఘనపూర్ మండలం బూరుపల్లి జడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లడం తో సన్మాన కార్యక్రమం మంగళవారం నిర్వ హించారు. ఈ సం దర్భంగా ఉపాధ్యాయులకు వీడ్కోలు సన్మాన కార్యక్రమం ప్రధానోపాధ్యాయులు నాగు మీర ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు కాముని రమేష్, రాజు, గిరిజ, పీ ఇందిరా, ఎం సురేష్ కుమార్, నగేష్ కుమార్, ఎం సంజీవ్ కుమార్, సత్యనారాయణ, భాస్కర్ లకు వీడ్కోలు సమావేశంలో ఘనంగా శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమానికి అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ చెవ్వ లక్ష్మి, నాయకులు బక్క సిద్దా గౌడ్, మరికిలి వెంకట్, అరికెల బాలరాజ్, లెంక రాజు, సిద్ధగిరి గౌడ్, తలారి యాదగిరి, లెంక రాజు హాజరై ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు.

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులు

- డీఈఓ రాధా కిషన్

నవతెలంగాణ-హవేలిఘనపూర్



సమాజంలో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులు అని మెదక్ డీఈఓ రాధా కిషన్ అన్నారు .మంగళవారం హవేలి ఘనాపూర్ మండలంలోని సాయి శ్రీనివాస్ గార్డెన్స్ లో మెదక్ జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో అభినందన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమము నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా డీఈఓ మెదక్ రాధా కిషన్ హాజరైనారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మనోధైర్యం వ్యాయామ పద్ధతులు వ్యాయామ ఉపాధ్యాయుల ద్వారానే లభిస్తాయని, వారి సేవలు అభినందనీయమని తెలిపారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బి రాఘవరెడ్డి, పి. కృష్ణమూర్తి, అధ్యక్షులు పి. సోమేశ్వరరావు, మెదక్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్. నాగరాజు, ఎస్. శ్రీనివాసరావు, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ జి.రమేష్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-పాపన్నపేట

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ 75వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు.దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం మండల కేంద్రం పాపన్నపేటలోని సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద ఏబీవీపీ మండల అధ్యక్షులు ప్రవీణ్ కుమార్ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై అలుపెరగని పోరాటాలు నిర్వహిస్తున్న అతిపెద్ద విద్యార్థి సంఘం ఏబీవీపీ అని కొనియాడారు. ఈ ఏబీవీపీని 1949 జూలై 9వ తేదీన ఢిల్లీలో అధికారికంగా స్థాపించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి శ్రీకాంత్, సభ్యులు రాజు, దుర్గాప్రసాద్ , జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



రైతాంగ హామీలను అమలు చేయాలి

- కరివేద మహిపాల్ రెడ్డి



నవతెలంగాణ-బెజ్జంకి

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి నెలలు గడుస్తున్నా రైతాంగానికి ఇచ్చిన హామీల అమలు చేయకుండా కాలయాపన చేస్తూ పబ్బం గడుపుతోందని తక్షణమే రైతాంగానికిచ్చిన హామీలను అమలు చేయాలని బీజేపీ కిసాన్ మోర్చ రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో హామీలను అమలు చేయాలని మండలాధ్యక్షుడు కొలిపాక రాజు అధ్వర్యంలో బీజేపీ శ్రేణులు తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్ర అందజేశారు. బీజేపీ నాయకులు బుర్ర మల్లేశం, దొమ్మటి రాములు, మండల ప్రధాన కార్యదర్శి ముస్కె మహేందర్, మండల ఉపాధ్యక్షుడు కొత్తపేట రామచంద్రం, పట్టణాధ్యక్షుడు సంగ రవి, దళిత మోర్చా మండలాధ్యక్షుడు వేముల శంకర్, మండల నాయకులు గంప రవి కుమార్, శీలం వెంకటేశం, ఒగ్గు కనకయ్య, రాజిరెడ్డి, గండ్ల శ్రీను పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యం

- ఎంపీఓ విష్ణు వర్ధన్
- దాచారంలో ఎత్తు,బరువు మేళా



నవతెలంగాణ-బెజ్జంకి

వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యమని ఎంపీఓ విష్ణు వర్ధన్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని దాచారం గ్రామ పంచాయతీ కార్యలయంలో ఏఎన్ఎం కనగండ్ల వినోద అధ్వర్యంలో గ్రామంలోని చిన్నారులకు ఎత్తు, బరువు మేళాను నిర్వహించారు.ఎత్తుకు తగిన బరువుతోనే సంపూర్ణ ఆరోగ్యమని ఐసీడీఎస్ సూపర్ వైజర్ నాగరాణి తెలిపారు.పంచాయతీ కార్యదర్శి సురేశ్, అంగన్వాడీ టీచర్లు ఎడబోయిన పుష్పలత,జీడి పద్మ, పోలవేణి స్వప్న,ఆశా వర్కర్లు కనగండ్ల రేణుక,దొగ్గల సంధ్య, చిన్నారుల తల్లిదండ్రులు,అంగన్వాడి పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

పైలట్ కుటుంబానికి పరామర్శ

- మాజీ ఎమ్మెల్యే



నవతెలంగాణ- గజ్వేల్

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పైలట్ శ్రీకరణ్ రెడ్డి కుటుంబాన్ని మంగళవారం గజ్వేల్ పట్టణంలో మాజీ ఎమ్మెల్యే తూము కుంట నర్సారెడ్డి పరామర్శించారు. ప్రమాదానికి సంబంధించిన విషయాలను మెదక్ ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఒక పైలట్‌ను ఈ ప్రాంతం కోల్పోవడం బాధాకరంగా ఉందని నర్సారెడ్డి అన్నారు. చిన్న వయసులోనే పైలట్ గా ఎంపికై ఎంతో భవిష్యత్తు ఉన్న యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమన్నారు. మృతుడి తండ్రి రఘును పరామర్శించారు. గుండె ధైర్యం చేసుకోవాలన్నారు.

జన్మదిన శుభాకాంక్షల వెల్లువ



నవతెలంగాణ- జగదేవ్‌పూర్

జగదేవపూర్ మండలం బీఆర్ఎస్ పార్టీ మండల రైతు కార్యదర్శి అలెటి లోలాకర్ రెడ్డి మంగళవారం నాడు మెదక్ డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డిని కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. గజ్వేల్ అభివృద్ధిలో బీఆర్ఎస్ ప్రభుత్వంతో కలసి తన సేవలు అందించారని తెలిపారు. ఇలాంటి జన్మదినాలు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని కోరుకున్నారు. ప్రజా సమస్యల సాధనలో మీ సేవలు ఎంతో అవసరమని కోరుకున్నారు.

సంక్షేమ పథకాలను అమలు చేస్తాం

- మైనార్టీ సెల్ నాయకులు



నవతెలంగాణ -గజ్వేల్

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ మైనార్టీ సెల్ నాయకులు అన్నారు. మంగళవారం గజ్వేల్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఆరు గ్యారంటీలు అమలు చేస్తున్నారని ప్రతిపక్షాలు కావాలని విమర్శలు చేస్తున్నాయన్నారు. మహిళలకు బస్సు ప్రయాణంతోపాటు విద్యుత్తు, గ్యాస్, రాజీవ్ ఆరోగ్యశ్రీ తదితర పథకాలను ఇప్పటికే అమలు చేస్తున్నారన్నారు. మిగతా అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి అమలు దిశగా అడుగులు వేస్తున్నారన్నారు. రైతులకు రుణమాఫీ చేసేందుకు సిద్ధమవుతుందన్నారు. మైనార్టీల సంక్షేమానికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. గజ్వేల్‌లో మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి నాయకత్వంలో సంక్షేమ పథకాలు ప్రజలకు అందిస్తున్నమన్నారు.

మిత్రునికి ఘన సన్మానం



నవతెలంగాణ-గజ్వేల్

ఇటీవల విడుదలైన ఉద్యోగ ప్రకటనలో పరీక్షలు రాసి వైద్య విధాన పరిషత్ లో ల్యాబ్ టెక్నీషియన్ గ్రేట్ టూలో ఉద్యోగం సాధించిన దొడ్డు రమేష్‌కు తోటి మిత్రులు మంగళవారం ఘనంగా సన్మానించారు. గజ్వేల్ మండలం రిమ్మనగూడ గ్రామానికి చెందిన రమేష్ ల్యాబ్ టెక్నీషియన్ జాబ్ సాధించడం వల్ల పలువురు అభినందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో స్నేహితులు నక్క రాముడు గౌడ్, అస్గర్, లడ్డు, కన్న యాదవ్, పాత్రికేయులునాయిని యాదగిరి, వెంకటాచారి తదితరులు సన్మానించారు.

ఘనంగా బట్టు అంజిరెడ్డి జన్మదిన వేడుకలు



నవతెలంగాణ- ములుగు

ములుగు మండల కేంద్రంలో మంగళవారం ప్రధాన కూడలి అంబేద్కర్ చౌరస్తా వద్ద ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీడైరెక్టర్ బట్టు అంజిరెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేకులు కట్ చేసి అనంతరం మర్కుక్ మండలంలోని ఎర్రవల్లి గ్రామంలో కేసీఆర్ ఫామ్ హౌస్‌కు వెళ్ళి కేసీఆర్ ఆశీర్వాదం తీసుకోన్నాడు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు వంటిమామిడి మార్కెట్ మాజీ చైర్మన్ జాంగిర్, జుబేర్ పాషా, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు విల్లాసాగర్ బాలరాజు, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ గౌడ్, తాజా మాజీ ఎంపీటీసీలు బొడ్డు ప్రవీణ్, హరిబాబు, మాజీ ఉపసర్పంచ్ దండే కర్ణాకర్ రెడ్డి, సీనియర్ నాయకులు దాస చంద్రశేఖర్, సాదుల శంకర్, దశరథ, భూచక్రం, సుధాకర్, శ్రీధర్, వార్డు మెంబర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

ఉచిత దంత వైద్య శిబిరం



నవతెలంగాణ-నంగునూరు

శ్రీనివాస సూపర్ స్పెషాలిటీ డెంటల్ హాస్పిటల్ సిద్దిపేట వారి సహకారంతో డాక్టర్ ఎల్. శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరాన్ని మంగళవారం నంగునూరు మండలం జేపీ తండా ప్రాథమిక పాఠశాలలో చేపట్టారు.పాఠశాలలో ఉన్న విద్యార్థులకు, గ్రామంలో దంత సమస్యలు ఉన్న ప్రజలుకు ఉచితంగా పరీక్షలు నిర్వహించారు.దంతాల రక్షణ పై విద్యార్థులకు, గ్రామ ప్రజలకు పలు సూచనలు, సలహాలు చేశారు. జేపీ తండా గ్రామంలో వైద్య శిబిరాన్ని నిర్వహించినందుకు శ్రీనివాస సూపర్ స్పెషాలిటీ డెంటల్ హాస్పిటల్ డాక్టర్ ను వారి బృందాన్ని శాలువాలతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చంద్రం, ఉపాధ్యాయురాలు శోభారాణి, గ్రామ సర్పంచ్ బిక్షపతి నాయక్, పంచాయతీ కార్యదర్శి కుమార్, అంగన్వాడి టీచర్, విద్యార్థుల తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

ఎస్ఐ హత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలి

- కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు బక్కెల్లి బాలకిషన్



నవతెలంగాణ - కొమురవెల్లి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట ఎస్ఐ శ్రీరామ్ శ్రీనివాస్ హత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలనికేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు బక్కెల్లి బాలకిషన్ డిమాండ్ చేశారు.కొమురవెల్లి మండల కేంద్రంలో మంగళవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకిషన్ మాట్లాడుతూ దళిత ఎస్ఐ ఆత్మహత్యకు కారకులైన సీఐ కానిస్టేబుల్‌లను తక్షణమే డిస్మిస్ చేయాలని సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. పోలీస్ శాఖలో కుల వివక్షత పై సీఎం తక్షణమే స్పందించాలన్నారు. చట్టాలు అమలు చేసే పోలీస్ శాఖలో కుల వివక్ష వేధింపుల వల్ల ఎస్ఐ శ్రీరామ్ శ్రీనివాస్ ఆత్మహత్య చేసుకుని చనిపోయాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం పటిష్టం చేసి పకడ్బందీగా అమలు చేసి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి కర్రోళ్ల ఎల్లయ్య, తాడూరు మల్లేశం, కాసర్ల రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

మోపెడ్‌ను ఢీ కొట్టిన కారు



నవతెలంగాణ-కొండపాక

మోపెడ్‌ను కారు ఢీ కొట్టడంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన దుద్దెడ శివారులో దర్గా కమాన్ సమీపంలో రాజీవ్ రహదారి పై మంగళవారం జరిగింది. కొండపాక మండలం సేలంపు గ్రామానికి చెందిన మల్లం శ్రీనివాస్ మంగళవారం ఉదయం పాల కోసం దుద్దెడకు మోపెడ్ పై వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తూ దర్గా కమాన్ వద్ద యూ టర్న్ చేస్తుండగా హైదరాబాద్ నుంచి కరీంనగర్ కు వెళ్తున్న కారు ఢీ కొట్టింది. దాంతో ఆయన రోడ్డుపై పడిపోవడంతో తీవ్ర గాయాలకు గురై అక్కక్కడే మృతి చెందాడు.మృతుని భార్య రేణుక ఫిర్యాదు మేరకు త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దోపిడి పై విచారణ జరపాలి

- టెండర్ లేకుండానే ప్రైవేట్ కంపెనీకి కట్టబెట్టిన బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు
- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చొప్పరి రవికుమార్



నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్

భవాని నిర్మాణ కార్మికులకు ఆరోగ్య పరీక్షల పేరుట జరుగుతున్న భారీ దోపిడీని అరికటాలని, రూ.లక్షల కార్మికుల సొమ్మును దుర్వినియోగం చేయడానికి వెంటనే ఆపి కార్మికుల సొమ్మును కాపాడాలని, బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి చొప్పరి రవికుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం యూనియన్ జిల్లా కమిటీ సమావేశం జిల్లా ఉపాధ్యక్షుడు పోతిరెడ్డి రాజు ఆధ్వర్యంలో జరగగా ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో భవన, ఇతర నిర్మాణ కార్మికులందరికీ ఆరోగ్య పరీక్షలు నిర్వహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి 2022 లో సీఎస్సీ హెల్త్ కేర్ వెల్నెస్ సర్వీసెస్ లిమిటెడ్ అనే సంస్థకు కాంట్రాక్ట్ ఇచ్చారు. ఒక్కో కార్మికుడికి నిర్వహించిన ఆరోగ్య పరీక్షల నిమిత్తం రూ.3.256 చొప్పున ప్రైవేట్ సంస్థకి భవన, ఇతర నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డ్(బీఓసీడబ్ల్యూ) చెల్లించాలని (జీవోఎంఎస్ 20, 2022 సెప్టెంబర్ 20 తేదీన) నిర్ణయించారు.బీఓసీడబ్ల్యూ గత ఏడాది ఆరోగ్య పరీక్షల కోసం రూ.124 కోట్లు ఖర్చు చేసింది. ఈ ఏడాది కూడా భారీగా ఖర్చు పెడుతున్నారు. వందల సంఖ్యలో ఆరోగ్య క్యాంపులు, లక్షల సంఖ్యలో కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించినట్లు అనేక దొంగ లెక్కలు సృష్టించి భారీ ఎత్తున బోర్డు నిధులను కాంట్రాక్ట్ సంస్థ కాజేస్తున్నదని, హెల్త్ క్యాంపులు నిర్వహించకపోయినా నిర్వహించినట్లు, కొన్ని పరీక్షలు మాత్రమే చేసి అనేక పరీక్షలు నిర్వహించినట్లు బిల్స్ పెట్టుకోవడం ఇలా అనేక అక్రమాలకు కాంట్రాక్ట్ సంస్థ పాల్పడుతున్నది.రాష్ట్రంలో 14 లక్షల మంది నిర్మాణ కార్మికులు ఉండగా ఇప్పటివరకు 11 లక్షల మందికి పరీక్షలు నిర్వహించినట్లు అధికారులు చెబుతున్నారు. కార్మికులకే కాకుండా వారి కుటుంబాలకు కూడా పరీక్షలు నిర్వహించడానికి అధికారులు సిద్ధమవుతున్నారు. మరింత భారీగా దోపిడీ చేయడానికే ఈ ఆలోచన జరుగుతున్నది. కార్మిక శాఖ అధికారులు కాంట్రాక్టర్తో కుమ్మక్కై, కార్మిక శాఖ నిధులను దోచుకుంటున్నారు.సీఎస్సీ హెల్త్ కేర్ సంస్థ 2022 లోనే ఏర్పాటయింది. అదే ఏడాది ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. టెండర్ లేకుండానే వందల కోట్ల విలువైన ఒప్పందాన్ని ప్రభుత్వం ఎలా కుదుర్చుకుంది? ఈ సంస్థకు ఎన్బీఎల్ గుర్తింపు కూడా లేదు. సీజీహెచ్ఎస్ రేట్ల ప్రకారమే ఈ కాంట్రాక్ట్ సంస్థకు చెల్లింపులు చేస్తున్నామని కార్మిక శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ రేట్ల ప్రకారమే తెలంగాణ రాష్ట్రంలోని విజయ డయాగ్నస్టిక్స్, అపోలో లాంటి అనేక ప్రముఖ వైద్య సంస్థలు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు వైద్యం అందిస్తున్నాయి. భవన నిర్మాణ కార్మికుల పరీక్షలు కూడా ఇలాంటి సంస్థలకే అప్పచెప్పొచ్చు కదా? వీటిని పక్కనపెట్టి ముంబైకి చెందిన అనుభవం లేని సీఎస్సీ హెల్త్ కేర్ కు ఎందుకు కాంట్రాక్ట్ ఇచ్చారు అవసరం ఉన్నా లేకపోయినా కార్మికులపై ఒత్తిడి తెచ్చి, భయపెట్టి ఆరోగ్య పరీక్షలు నిర్వహించాల్సిన అవసరం ఏమొచ్చిందని అన్నారు.నిర్మాణ కార్మికులకు వైద్య పరీక్షల పేరుతో జరుగుతున్న దోపిడీని తక్షణమే ఆపాలి. సీఎస్సీ హెల్త్ కేర్ తో కుదుర్చుకున్న ఒప్పందాన్ని రద్దు చేయాలి. ఆరోగ్య పరీక్షలు అవసరమైన కార్మికులకే ఉచితంగా నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఈ మొత్తం ఒప్పందంపై ఉన్నత స్థాయి విచారణ జరిపి బాధ్యులైన అధికారులు, రాజకీయ నాయకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన చేపడుతామని అన్నారు. ఈ సమావేశంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు సిరికొండ సురేష్, జిల్లా కమిటీ సభ్యులు బాలయ్య, యాదయ్య, బాల నర్సయ్య, అంతయ్య, రాములు, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

నూతన వాహనాలు ప్రారంభం

- మున్సిపల్ చైర్‌పర్సన్



నవతెలంగాణ-సిద్దిపేట

పట్టణంలో చెత్త సేకరణ కోసం మూడు నూతన వాహనాలను కొనుగోలు చేసి ప్రారంభించుకున్నట్టు మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రాజనర్సు తెలిపారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో మూడు స్వచ్ఛ ఆటోలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు ఆదేశాల మేరకు స్వచ్ఛ సిద్దిపేట గా ఉంచడానికి, ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ చేయడానికి వాహనాలను కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి, మున్సిపల్ వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు, పట్టణ కౌన్సిలర్లు, మాజీ మున్సిపల్ చైర్మన్ కడవేరుగు రాజనర్సు, కో-అప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా మంత్రి జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-సిద్దిపేట

రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి, శిశు ,మహిళ సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనుసూయ (సీతక్క) జన్మదిన వేడుకలను సిద్దిపేట పట్టణంలో మహిళా కాంగ్రెస్ నాయకురాలు బీజాని ఆధ్వర్యంలో అంగన్వాడి స్కూల్లో కేక్ కట్ చేసి నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సిద్దిపేట అర్బన్ మండల అధ్యక్షులు బిక్షపతి, మార్క సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సతీష్ కుమార్, మంతెన రాజనరేందర్ లు పాల్గొని, పిల్లలకు బిస్కెట్లు, బుక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకురాలు ఎల్లవ్వ, మమత, రజిని, భవాని, అంగన్వాడి టీచర్ కృష్ణవేణి, లత, రజియా బేగం తదితరులు పాల్గొన్నారు.

అపరిచితుల ఫోన్ కాల్స్,మాటలు నమ్మవద్దు

- పోలీస్ చట్టాలపై అవగాహన
- సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను



నవతెలంగాణ-నంగునూరు

అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్, మాటలు నమ్మవద్దని సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను తెలిపారు.మంగళవారం నంగునూరు మండలం నర్మెట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు, మహిళల రక్షణ చట్టాల గురించి, ర్యాగింగ్, ఇవిటీజింగ్,పోక్సో, షీ టీమ్స్, యాంటీ హ్యూమెన్ ట్రాఫికింగ్, సైబర్ నేరాలు, నూతన చట్టాల గురించి అవగాహన కల్పించారు. సీఐ శ్రీను, సిద్దిపేట షీటీమ్ బృందం, భరోసా సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్, మాటలు నమ్మవద్దని సూచించారు.సోషల్ మీడియాకు ఎంత దూరం ఉంటే భవిష్యత్ అంత మంచిగా ఉంటుందన్నారు.మహిళల భద్రతకు పోలీసులు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారని మహిళల భద్రత మా ముఖ్య బాధ్యతని చెప్పారు.భారతదేశంలో అమలవుతున్న నూతన చట్టాల గురించి ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. చదువుకునే సమయములో చెడు అలవాట్లకు బానిస కావొద్దొని అన్నారు. ప్రతి ఒక్కరూ చదువుపై దృష్టి సారించాలన్నారు. డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. చదువుకోవడం వలన భవిష్యత్తు ఉన్నతంగా ఉంటుందని తెలిపారు. పిల్లలను చదివించటానికి తల్లిదండ్రులు చేస్తున్న కష్టాన్ని మనసులో పెట్టుకొని చదువులపై శ్రద్ధ వహించాలని సూచించారు. కష్టపడి చదవాల్సిన వయస్సులో చెడు అలవాట్లకు బానిసలు కావద్దని సూచించారు. నేటి సమాజంలో పురుషులతో సమానంగా మహిళలు ఉద్యోగాలు సాధించి ఎన్నో రంగంలో స్థిరపడుతున్నారని తెలిపారు. చదువుపై క్రమశిక్షణ, పట్టుదల, నేర్చుకోవాలని తపన తప్పకుండా కలిగి ఉండాలని పేర్కొన్నారు. కష్టపడి చదువుకుని ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు. భారతదేశంలో నూతన చట్టాలు జూలై 1వ తేదీ నుంచి అమలు చేస్తామన్నార. నూతన చట్టాలలో నేరం చేసిన నేరస్తులకు కఠినమైన శిక్షలు అమలు చేయడం, బాధితులకు అండగా చట్టాలు నిలుస్తాయని పేర్కొన్నారు. మహిళలు, పిల్లలు ఎవరితోనైనా హింసకు ఎవరైనా హేళనంగా మాట్లాడిన మౌనం వీడి తల్లిదండ్రులకు గానీ, స్నేహితులకు గానీ చెప్పుకోవాలని సూచించారు. లేని పక్షంలో డయల్ 100 కు కాల్ చేసి తక్షణమే పోలీస్ సహాయం పొందాలని సూచించారు. మహిళలు, పిల్లల రక్షణకు పెద్దపీట వేయడం, సమాచార అందించిన వారి పేర్లు గోప్యంగా వుంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యాయులు, సిద్దిపేట షీటీమ్ బృందం, కిషన్, ఏఎస్ఐ, మహిళా కానిస్టేబుళ్లు మమత, వీణకుమారి, కానిస్టేబుళ్లు ప్రవీణ్, లక్ష్మీనారాయణ, భరోసా సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

స్కూల్ గుర్తింపును రద్దు చేయాలి



నవతెలంగాణ-దుబ్బాక

దుబ్బాకలోని శ్రీవాణి స్కూల్ గుర్తింపును రద్దు చేయాలని, ఆ దిశగా విద్యాశాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని పీపీసీఎస్ వైస్ చైర్మన్ కాల్వ నరేష్ డిమాండ్ చేశారు.మంగళవారం దుబ్బాకలో మీడియాతో కాల్వ నరేష్ మాట్లాడారు.శ్రీవాణి స్కూల్ యాజమాన్యం విద్యార్థుల పట్ల నిర్లక్ష్య వైఖరిని అవలంభిస్తుందని విమర్శించారు.పాఠశాల ముగిశాక ఇంటికి వెళ్లే క్రమంలో ఇదే స్కూల్లోయూకేజీ చదువుతున్న దుబ్బాక పట్టణ కేంద్రానికి చెందిన మాదుగుల రేఖ రాజు దంపతుల కుమార్తె జాశ్విక ను వేరొకరి పేరెంట్ గార్డియన్ తీసుకువెళ్లాడని తెలిపారు.రోజు లాగే ఇంటికి తీసుకెళ్తామని వచ్చిన తల్లిదండ్రులకు వీరి కూతురు జస్విక కనిపించకపోవడంతో తీవ్ర ఆందోళన చెందారన్నారు. పాఠశాల యాజమాన్యాన్ని అడగగా పట్టింపు లేనట్టుగా వ్యవహరించారని తెలిపారు. గంట తర్వాత తిరిగి పాఠశాలకు వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.విద్యార్థులను ఇంటికి చేర్చే క్రమంలో కనీస బాధ్యత లేకుండా స్కూల్ యాజమాన్యం ఉందని, నిబంధనల ప్రకారం పాఠశాలకు ప్లే గ్రౌండ్ లేదని, అర్హత కలిగిన ఉపాధ్యాయులను నియమించుకోవడంలేదని ఆరోపించారు.ఎంఈఓ తో ఫోన్‌లో మాట్లాడగా విచారణ జరిపి శ్రీవాణి స్కూల్ పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్టు చెప్పారు.జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి శ్రీవాణి స్కూల్ పై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని లేకపోతే రాష్ట్ర ముఖ్యమంత్రి కి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. విద్యార్థిని బంధువులు తునికి సురేష్, గోపి, సురేష్ అన్నారు.

ఇచ్చిన హామీలను నెరవేర్చే బాధ్యత సీఎంది



నవతెలంగాణ-సిద్దిపేట

ఎన్నికలకు ముందు ముదిరాజులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై ఉందని ముదిరాజ్ మహాసభ తెలంగాణ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల మల్లేశం ముదిరాజ్ అన్నారు. తమ సమస్యలను సీఎంకు విన్నవించేందుకు ఈనెల 15వ తేదీ నుంచి 20వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ అధికారుల ద్వారా వినతి పత్రాలు పంపిస్తామని తెలిపారు. సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో కార్యక్రమ గోడ పత్రికను ముదిరాజ్ మహాసభ రాష్ట్ర నాయకులు తుపాకుల బాలరంగం, జిల్లా అధ్యక్షుడు ధర్మా ముదిరాజులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ బీసీడీలో కొనసాగుతున్న ముదిరాజులను బీసీఏ లోకి మార్చాలన్నారు. మత్స్యకారుల అభివృద్ధి కోసం తెలంగాణ మత్స్యకార అభివృద్ధి బోర్డు ఏర్పాటు చేసి తగిన నిధులు కేటాయించాలన్నారు. 50 ఏండ్లు నిండిన ముదిరాజ్ మత్స్యకారులకు ఆసరా పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఉచిత చేప పిల్లల పథకం 100 శాతం మత్స్యకారులకు చేరే విధంగా పంపిణీ చేపట్టాలన్నారు. అలాగే రాజకీయరంగంలో ముదిరాజుల ప్రాతినిధ్యం పెంచేందుకు నామినేట్ పోస్టులు ముదిరాజ్లకు కేటాయించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న వినతి పత్రాల సమర్పణ కార్యక్రమంలో ముదిరాజుల పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మహా సభ జిల్లా అధ్యక్షులు ధర్మ, కొమురవెల్లి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ బిక్షపతి, రాష్ట్ర కళాకారుల అధ్యక్షులు ఎర్ర నాగేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి సాగర్, జిల్లా ఉపాధ్యక్షులు గొట్టం రాధాకృష్ణ, నాయకులు గట్టు నర్సింలు, కొంతం శ్రావణ్ కుమార్, నాయిని కృష్ణ, తోట్ల పర్శరాములు తదితరులు పాల్గొన్నారు

అభివృద్ధిని విధ్వంసం చేస్తున్న సీఎం



నవతెలంగాణ-గజ్వేల్

కేసీఆర్ హయంలో గజ్వేల్ 50 ఏళ్ల అభివృద్ధిలో ముందుకు వెళ్లగా మిగిలిన పనులు చేయకుండా సీఎం రేవంత్ రెడ్డి దాని విధ్వంసం చేస్తున్నారని గజ్వేల్ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నేతి చిన్న సంతోష్ కుమార్ అన్నారు. ఆయన ఇంటిలో మంగళవారం నవతెలంగాణతో మాట్లాడుతూ. గతంలో ఏ ప్రభుత్వం కూడా అభివృద్ధి చేయలేకపోయిందని 2014లో కేసీఆర్ గజ్వేల్ నుంచి పోటీ చేసి వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి రెండుసార్లు ముఖ్యమంత్రి అయి గజ్వేల్ అభివృద్ధిని సాధించినట్లు చెప్పారు. కేసీఆర్ చేయగా మిగిలిపోయిన అభివృద్ధిని చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి ఇష్టం లేదన్నారు. దీంతో ప్రజలు అనేక ఇబ్బందులు గురవుతున్న ,రాజకీయ అంశాన్ని తెరపైకి తెస్తున్నట్లు విమర్శించారు. పార్టీలకు అతీతంగా అభివృద్ధి జరగాలి తప్ప గతంలో కొంత నిర్లక్ష్యం జరిగిన కొన్ని పనులు నిలిచిపోయినట్టు తెలిపారు. ప్రజలు కాంగ్రెస్కు అధికారం ఇచ్చినందున అభివృద్ధి చేయడం వారి బాధ్యత అన్నారు. గజ్వేల్ రింగ్ రోడ్డు తో పాటు, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ పట్టణాల్లో చివరి దశలో ఉన్న బస్టాండ్లను పూర్తి చేయాలన్నారు. గజ్వేల్ అభివృద్ధిని పూర్తిగా అట్టడుగు నెట్టేయాలని రేవంత్ రెడ్డి కుట్ర పన్నుతున్నారని విమర్శించారు. రాజకీయ కోణం ఆలోచించకుండా ప్రజా సంక్షేమాన్ని ఆలోచించి పాలన చేయాలని కోరారు. పెన్షన్ పెంచి అందించాలని తెలిపారు. రైతు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అధికారంలోకొచ్చి ఎనిమిది నెలలు గడుస్తున్న గజ్వేల్‌లో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందన్నారు.

భక్తిరత్న అవార్డు గజ్వేల్ కే గర్వకారణం



నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

భక్తి రంగంలో 25ఏండ్ల విశేష సేవలకు జాతీయ స్థాయిలో భక్తిరత్న పురస్కారం గజ్వేల్ పట్టణానికి చెందిన రామకోటి రామరాజుకు దక్కిందని, అది గజ్వేల్ కే గర్వకారణమని ఎఫ్డీసీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ ఇంచార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి అన్నారు. మంగళవారం గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రామరాజును శాలువతో సన్మానించారు.ఈ సందర్భంగా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ గజ్వేల్ పట్టణ ముద్దుబిడ్డ, అపర రామ భక్తుడు రామకోటి రామరాజు కు జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు రావడం గజ్వేల్ నియోజకవర్గానికి గర్వకారణం అన్నారు. గత 25ఏండ్ల పాటు భక్తి మార్గంలో తనదైన ముద్ర వేసరన్నారు.భక్తి మార్గంలో నిమగ్నమై మరో రామదాసుగా నిలిచారన్నారు. భద్రాచల దేవస్థానమే భక్తిలో ప్రత్యేకతను గుర్తించినదన్నారు.ఆ గుర్తింపు మన గజ్వేల్ వాసికి రావడం ఆనందంగా ఉందన్నారు.తన సేవలు సమాజానికి మేలుకొలుపుగా, అలుపెరగని యోధుడిలా పని చేస్తాడని కొనియాడారు. మన తెలంగాణ ప్రాంతం నుంచి భక్తిరత్న జాతీయ గౌరవ పురస్కారం రావడం హర్షించదగ్గ విషయమన్నారు. మరెన్నో అవార్డులు, రివార్డులు భవిష్యత్తులో రామకోటి రామరాజును వరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎన్. సి. రాజమౌళి, మాజీ జడ్పీటీసీ పంగ మల్లేశం, కౌన్సిలర్లు రహీం, శ్రీనివాస్, మార్కంటి వరలక్ష్మీ, కనకయ్య, విద్యారాణి శ్రీధర్, నాయకులు మద్దూరి శ్రీనివాస్,గోలి సంతోష్, శ్రీనివాస్, మహేందర్ రెడ్డి, మల్లేశం, రమేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

జ్వరాలు వస్తే సమాచారం ఇవ్వండి

- 6వ వార్డ్ కౌన్సిలర్



నవతెలంగాణ -గజ్వేల్

వార్డులో ఎవరికైనా జ్వరాలు, వాంతులు, విరేచనాలు అయినట్లయితే తనకు వెంటనే సమాచారం ఇవ్వాలని, నేను అందుబాటులో వుండి మీ వద్దకు వస్తానని మున్సిపల్ పరిధిలోని ఆరో వార్డు కౌన్సిలర్ బబ్బూరి రజిత గౌడ్ అన్నారు. మంగళవారం వార్డు పరిశీలిస్తూ ప్రజలకు భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 6వ వార్డులో రహమత్ నగర్ నుంచి బాలాజీ థియేటర్ పరిశుభ్రత చర్యలు, దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఏ రాత్రి అయినా ఫోను చేయవచ్చు అని చెప్పారు.తూప్రాన్ రోడ్ వరకు డ్రై డే కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతపై దోమల వల్ల వచ్చే వ్యాధుల పట్ల అవగాహన కల్పించినట్టు తెలిపారు. వర్షాకాలంలో ఎక్కువగా వచ్చే సీజనల్ వ్యాధుల మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ, చికెన్ గున్య, ఫైలేరియా ప్రబలే అవకాశం ఉందని జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు పిలుపునిచ్చారు. దోమల నివారణకై డెమో ఫాస్ మందును మురికి కాలువలో పిచికారి చేస్తున్నట్టు చెప్పారు.. సీజనల్ వ్యాధులు వల్ల ప్రాణహాని కూడా కలగవచ్చునని డెంగ్యూ జ్వరము చాలా ప్రమాదమని విష జ్వరాలు ప్రబలె అవకాశం ఉందని దోమలను అరికట్టడానికి ఓడమాస్ గుడ్ నైట్, దోమతెరలు వాడుకోవాలన్నారు. ఇంటి సమీపంలో వాడిన కుళ్ళిపోయిన వస్తువులను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. టైర్లు, కొబ్బరి చిప్పలు, ఎయిర్ కూలర్లో నీరు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని ఎవరికైనా జ్వరము, వాంతులు, విరేచనాలు, దద్దుర్లు, డీహైడ్రేషన్, చెమటలు పట్టడం, మగతగా ఉండడం, కాళ్లు చేతులు లాగడం, సొమ్మసిల్లి క్రింద పడిపోవడంలాంటి లక్షణాలు కనిపించిన వెంటనే డాక్టర్లను సంప్రదించాలని సూచించారు . లేవలేని పరిస్థితిలో ఉంటే 104, 100 నంబర్స్ కు ఫోన్ చేయాలని, ఏ సమయంలోనైన నన్ను సంప్రదించవచ్చునని, మున్సిపల్ సిబ్బందికి వార్డు గ్రూపులో సమాచారాన్ని అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ డివిజన్ ఏపీ డెమిక్ సెల్ సభ్యులు దేవసాని, వాసుదేవ్, డి.నాగరాజు, దుర్గా గౌడ్, రమేష్ ఫీల్డ్ వర్కర్, ఆశ వర్కర్లు అమృత, పద్మ, భావన, పాల్గొన్నారు.

ఘనంగా శీతలభవాని వేడుకలు



నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండలం కుందన్ వాణి గ్రామ పరిధిలో ఉన్నటువంటి చౌటకుంటా తండాలో గిరిజనుల ఆరాధ్య దైవమైనటువంటి శీతల భవాని వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తండా పెద్ద మాలోతు శంకర్, రాజు నాయక్ మాట్లాడుతూ ప్రతి ఏడాది ఆషాడ మాసంలో తొలకరి విత్తనాలు వేసిన తర్వాత శీతల భవాని వేడుకలు నిర్వహిస్తామని అన్నారు. ముఖ్యంగా ఈ పండగలో గిరిజన వేషధారణలో మహిళలుంటారు. అనంతరం శీతల భవాని తల్లిని పంటలు బాగా పండాలని, పాడి పశువులు పెరగాలని పూజ చేస్తారు. అనంతరం గొర్రెలు, మేకలు, పశువులు వంటి వాటిని దాటిస్తామని తెలిపారు. శీతల భవాని తల్లికి పెట్టినటువంటి నవధాన్యాలను పశువులపై చల్లుతామని, తండాలో అందరూ ఆరోగ్యంగా ఉండాలని, చదువుకునే పిల్లలకు ఉద్యోగాలు రావాలని శీతల భవానికి పూజలు చేసి కోరికలు కోరుకుంటామన్నారు. చివరికి మహిళలంతా కలిసి రౌండ్‌గా తిరుగుతూ గిరిజన పాటలు పాడుతూ నృత్యాలు చేస్తూ ఆనందంగా గడుపుతారన్నారు. ఈ కార్యక్రమంలో మాలోతు కృష్ణ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

5

మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

బుధవారం | 10 జూలై 2024 | www.navatelangana.com

రైతుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి



-ప్యాక్స్ ఛైర్మన్ పెర్యాల దెవేందర్‌రావు

నవతెలంగాణ-కోహెడ

రైతుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ప్యాక్స్ ఛైర్మన్ పెర్యాల దెవేందర్‌రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వ్యవసాయ పనులు ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా పెట్టుబడికి ఇచ్చే రైతు భరోసా ఇవ్వడం లేదన్నారు. గత సంవత్సరం కన్నా ముందే నైరుతి రుతుపవనాలు ప్రవేశించడంతో దుక్కులు దున్నడం, విత్తనాలు విత్తడం వంటి పనులు పూర్తికావస్తున్నావన్నారు. వరి నార్లు నాటుకు వచ్చినా నాట్లు వేయడానికి డబ్బులు లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఎన్నికల హామీలో భాగంగా ఆ పెట్టుబడి సహాయం ఫసలుకి రూ.ఏడు వేల ఐదు వందల చొప్పున ఇస్తామని హామి ఇచ్చి గద్దెనెక్కిన ప్రభుత్వం నేటి వరకు పంట పెట్టుబడి సహాయం అందించడం లేదన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి రైతు భరోసా డబ్బులు వెంటనే రైతుల అకౌంట్‌లలో జమ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.


విద్యార్థికి ఘన సన్మానం



నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

గుజరాత్ లోని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చదువుకున్న పాఠశాలలో ఏడు రోజులపాటు విజన్ వికసిత భారత్ ప్రేరణ కార్యక్రమానికి ఎంపికై పర్యటన ముగించుకుని వచ్చిన సిద్దిపేట అర్బన్ మండలం బక్రీ చెప్యాల ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థిని మీర్జా సపురాను మంగళవారం ఉపాధ్యాయ బృందం సన్మానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ బృందం మాట్లాడుతూ విద్యార్థులకు ఆట, పాటలతో పాటు మానవతా విలువలు అక్కడి చారిత్రాత్మక ప్రదేశాల గురించి పూర్వీకులు చేసిన కృషి గురించి విద్యార్థినికి అవగాహన కల్పించారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగేందర్, సునీత, అనిల్ కుమార్, సుహాసిని, పూర్ణచంద్రరావు, శ్రీశైలం, రాజేందర్, రమాదేవి, నాగయ్య, ఆంజనేయులు, సరిత పాల్గొన్నారు.

రేసింగ్ చేసిన బైక్ సీజ్.. రేసర్లపై కేసు నమోదు



నవతెలంగాణ-చిన్నకోడూరు

శబ్దాలు అరుపులతో, అతివేగంగా, భయభ్రాంతులకు గురిచేస్తూ బైక్ రేసింగ్ చేస్తున్న ద్విచక్ర వాహన దారులపై కేసు నమోదు చేసుకొని ద్విచక్ర వాహనం సీజ్ చేసినట్టు చిన్నకోడూరు ఎస్ఐ బాల కృష్ణ తెలిపారు. చిన్నకోడూరు ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం వారాంతాలలో రంగనాయక సాగర్ ప్రాజెక్టు కట్టపై ద్విచక్రవాహనం నెం.టీఎస్ 36ఎస్0327తో విన్యాసాలు చేస్తూ, అరుస్తూ రేసింగ్‌కు పాల్పడిన ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసునమోదు చేసి బైక్‌సీజ్ చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

ఘనంగా సిద్ధప్ప వరకవి జయంతి వేడుకలు



నవతెలంగాణ-కోహెడ

కోహెడ మండలంలోని గుండా రెడ్డిపల్లి గ్రామంలో సిద్ధప్ప వరకవి 121వ జయంతి వేడుకలను ఆయన శిష్యులు, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. సిద్ధప్ప రాసిన గ్రంథాల్లోని పద్యాలు, పాటలు చదువుతూ భజనలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాణిక్యలింగం, కాంగ్రెస్ నాయకులు సంజీవరెడ్డి, శిష్యులు పాల్గొన్నారు.

మోటార్ సైకిళ్ల దొంగ అరెస్ట్



నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

మోటార్ సైకిళ్లను దొంగలించిన నేరస్తున్ని అరెస్టు చేసి, అతని వద్ద నుంచి నాలుగు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్టు టూటౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు. మంగళవారం సిద్దిపేట టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ సిద్దిపేట పట్టణం శ్రీనివాస్‌నగర్ కు చెందిన టి.శ్రీనివాస్ తన ఇంటి ముందు ఉంచిన స్కూటీని ఎవరో ఎత్తుకెళ్లినట్టు ఇచ్చినట్లు పిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన తాను కేసు పరిశోధనలో భాగంగా మంగళవారం ఉదయం సిబ్బందితో కలిసి రంగీలా దాబా వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా, కోండపాక మండలం మర్పడ్గ గ్రామానికి చెందిన పబ్బోజు రమేష్ పోలీసులను చూసి మోటార్ సైకిల్ తో పారిపోవడానికి ప్రయత్నించగా పట్టుకొని విచారించగా, అతను సిద్దిపేటతో పాటు, చేర్యాల, రాయపోల్ మండలాలలో నాలుగు బైక్‌లు దోంగతనం చేసినట్టు ఒప్పుకున్నాడని, అతన్ని అరెస్ట్ చేసి టూ వీలర్లను స్వాధీనం చేసుకుని, జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపినామన్నారు. అతను 2023లో సిద్దిపేట వన్ టౌన్ పరిధిలో మూడు బైకులు, టూ టౌన్ ఏరియాలో ఒక బైకు దొంగతనం చేసి జైలుకు పోయి వచ్చిండన్నారు.

గజ్వేల్‌లో కృతజ్ఞత సభ



- తరలివెళ్లిన బీజేపీ నాయకులు

నవతెలంగాణ-మర్కుక్

మెదక్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందిన రఘునందన్ రావు మంగళవారం గజ్వేల్ లోని ప్రయివేట్ ఫంక్షన్ హాల్‌లో ఆయన గెలుపునకు కృషిచేసిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలపడానికి కృతజ్ఞత సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ మండల అధ్యక్షులు సాయి రెడ్డి రాంరెడ్డి ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు మాజీ జెడ్పీటీసీ సింగం సత్తయ్య, ఉపాధ్యక్షులు తాడూరి మహేష్ గౌడ్, ఆర్ కొమురయ్య, ప్రధాన కార్యదర్శి జుగురాజ్ రాజేందర్ సింగ్, తిరుపతి రెడ్డి, కిసాన్ మోర్చా అధ్యక్షులు పాండు సింగ్, బీజేవైఎం మండల అధ్యక్షులు పంజా మధు, బీజేవైఎం మండల జనరల్ సెక్రెటరీ కొండ బాలకృష్ణ, బూత్ అధ్యక్షులు గంధమల చంద్రం, అప్పాల మల్లేశం, కొండల్, మహేష్, దేశమైన రామాంజనేయులు, తోట లక్ష్మణ్, కుశల్ సింగ్, కొంతం శివ, నాయకులు, కార్యకర్తలు తదిరులున్నారు.

సీఐ జితేందర్ రెడ్డిని బర్తరఫ్ చేయాలి

- ఏఐఏవైఎస్ మండలాధ్యక్షుడు దీటి బాలనర్స్ డిమాండ్



నవతెలంగాణ-బెజ్జంకి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట ఎస్ఐ శ్రీరాముల శ్రీనివాస్‌ను వేధింపులకు గురిచేసిన సీఐ జితేందర్ రెడ్డిని విధుల నుంచి బర్తరఫ్ చేయాలని ఏఐఏవైఎస్ మండలాధ్యక్షుడు దీటీ బాలనర్స్ ప్రభుత్వాన్ని మంగళవారం డిమాండ్ చేశారు.అత్యున్నత చట్టాలను అమలు పర్చే పోలీస్ శాఖలో కుల వివక్షత అనవాళ్లు బహిర్గతమవ్వడం సిగ్గుచేటని..వేధింపులకు గురిచేసిన సీఐతో పాటు నలుగురు పోలీసులపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి ఎస్ఐ కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని దీటీ బాలనర్స్ విజ్ఞప్తి చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

- చికిత్స పొందుతూ మృతి



నవతెలంగాణ -నంగునూరు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన నంగునూరు మండలం బద్దిపడగ గ్రామంలో మంగళవారం జరిగింది.గ్రామస్థుల రాజగోపాల్ పేట పోలీసుల కథనం ప్రకారం వివరాలు హన్మకొండ జిల్లా పరకాల గ్రామానికి చెందిన నేరాళ్ళ విజయ్ కుమార్ (36) సిద్దిపేటలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ ఇంటిగ్రేటెడ్ బాలుర హాస్టల్లో కామాటి గా పనిచేస్తున్నట్టు తెలిపారు. రోజు మాదిరిగా హుస్నాబాద్ నుంచి సిద్దిపేటకు స్ప్లెండర్ బైక్ పై వస్తున్న క్రమంలో బద్దిపడగ బస్టాండ్ వద్ద ట్యాంకర్‌ను ఢీకొనడంతో రోడ్డుపై పడ్డాడు. దీంతో తలకు తీవ్ర గాయమై రక్తస్రావం అయింది.దీన్ని గమనించిన గ్రామస్తులు వెంటనే 108కు ఫోన్ చేయగా అంబులెన్స్ లో 108 సిబ్బంది ప్రథమ చికిత్స చేస్తూ సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుని భార్య నేరాళ్ళ వాణి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు రాజగోపాల్ పేట ఎస్ఐ యు.భాస్కర్ రెడ్డి తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి

- జిల్లా అదనపు కలెక్టర్ గరీమ అగర్వాల్



నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్

వర్షాకాలం దృష్ట్యా జిల్లాలో సీజనల్ వ్యాధులు, డయేరియా, డెంగ్యూ, ఇతరత్రా వ్యాధులు భారిన పడకుండా ప్రతి ఒక్కరినీ అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులతో జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ అన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ వారి ఆధ్వర్యంలో జిల్లా టాస్క్ ఫోర్స్ కమీటి సమావేశం జిల్లా అదనపు కలెక్టర్ అధ్యక్షత జరిగింది.ముందుగా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్. విజయ రాణి వర్షకాలం లో ఎదుర్కొనే చర్యల గూర్చి తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ..జిల్లాలో ప్రతి గ్రామములో ఓఆర్ఎస్ కార్నర్ ఏర్పాటు చేయాలని, ఎవరికైనా డయేరియాతో బాధపడుతున్నట్లయితే వెంటనే తగు చర్యలు తీసుకొని ఎలాంటి ప్రాణహాని లేకుండా కాపాడాలని వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందిని ఆదేశించారు. అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో , పాఠశాలలో వ్యక్తిగత , పరిసరాల పరిశుభ్రత ముఖ్యంగా చేతుల శుభ్రత పైన వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, అంగన్వాడీ కేంద్రాల్లో, పాఠశాలలో, జీపీల్లో తగినన్ని ఓఆర్ఎస్, జింకు టాబ్లెట్లు అందుబాటులో ఉంచాల న్నారు. జిల్లాలో రక్షిత మంచినీరు సరఫరా చేసే విధంగా నీటిపారుదల శాఖ వారు చర్యలు తీసుకోవాలని అలాగే క్లోరినేషన్ ప్రక్రియ సైతం పర్యవేక్షణ చెయ్యాలన్నారు. ఆశా కార్యకర్త గ్రామంలో డయేరియాతో బాధపడుతున్న వారిని గుర్తించి లైన్ లిస్టును సిద్ధం చేసి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారికి, ఎంఆర్ఓ, ఎంపీడీఓ గారికి ఇవ్వాలని ఆదేశించారు. గ్రామపంచాయతీ, మున్సిపాలిటీలలో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలన్నారు. వర్షాకాలంలో అంటూ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉన్నది కాబట్టి అందులో ప్రధానంగా డయేరియా ఎక్కువైతే ప్రమాదం జరిగే అవకాశం ఉంటుంది. ఎవరికైనా డయేరియా లక్షణా లు ఎక్కువ ఉన్నట్లయితే వెంటనే వారిని ఉన్నతమైన ప్రభు త్వ దవాఖానకు పంపాలన్నారు. ప్రతి ఆశా కార్యకర్త నుంచి వైద్యాధికారి వరకు ప్రతి ఒక్కరూ ఈ డయేరియాను అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమము ఆగస్టు 31వ తేదీ వరకు నిర్విరామంగా జరుగుతుందన్నారు. డయేరియా వ్యాధి లక్షణాలు ఉన్నట్లయితే వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ద్వారా తగిన చికిత్సలు తీసుకొని ఆరోగ్యంగా ఉండేటట్టు సహకరించాలని జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్ఓ డా. పుట్ల శ్రీనివాస్, డీఆర్డీఏ పీడి జయదేవ్ ఆర్యా, డీపీఓ దేవకి దేవి, డీడబ్ల్యూఓ శారద, డీఈఓ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఈఈ గిరిధర్, మున్సిపల్ కమిషనర్లు, ఆర్సీఓ నిర్మల, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓలు పాల్గొన్నారు.

నవ తెలంగాణ- సిద్దిపేట కలెక్టరేట్

జిల్లాలోని నేషనల్ హైవే నిర్మాణ ప్రాంతమైన మిట్టపల్లి నుంచి జిల్లా పరివాహక ప్రాంతం వరకు రోడ్డు వెంబడి అవెన్యూ ప్లాంటేషన్ ఏర్పాటు చేయాలని, సంబంధిత అధికారులకు జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్ సమావేశం నిర్వహించి సూచించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్లో నేషనల్ హైవే ఇంజనీరింగ్ అధికారులు, జిల్లా అటవీశాఖ, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ, జిల్లా గ్రామపంచాయతీ శాఖ అధికారులతో జిల్లా అదనపు కలెక్టర్ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ...మిట్టపల్లి నుంచి జిల్లా పరివాహక గ్రామాల వరకు సుమారు 14 గ్రామాలలో నేషనల్ హైవే రోడ్డు నిర్మాణం పూర్తయిన రోడ్డు వెంబడి అవెన్యూ ప్లాంటేషన్ పెట్టేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలి. దాదాపు 14000 మొక్కలు పెట్టేందుకు ఆస్కారం ఉందన్నారు. కొత్త రోడ్డు పక్కన లాండ్ లెవెలింగ్ చేసి ఫారెస్ట్ నుంచి మొక్కలు పెట్టే ప్రాంతాలకు మొక్కలను రవాణా చేయాలని నేషనల్ హైవే అధికారులకు తెలిపారు. ఖాళీ చేసిన ప్రాంతాలలో మా ర్కింగ్ చెయ్యాలని అడవి శాఖ అధికారులకు, మార్కింగ్ చేసిన ప్రాంతాల్లో ఫిట్టింగ్, మొక్కలను పెట్టడం, ట్రీ గార్డ్ అమర్చడం, మెయింటెనెన్స్ బాధ్యత పూర్తిగా గ్రామపం చాయతీ అధికారులదే, రోడ్డు నిర్మాణం పూర్తయిన ప్రాం తాన్ని మొత్తం ఒకసారి పర్యవేక్షణ చేయాలని డీఆర్డీఏ ఫారెస్ట్ అధికారులకు సూచించారు. ఆయా గ్రామాల పంచాయతీ సెక్రటరీలు మీ పరిధిగల రోడ్డు వెంబడి మొక్కలను అత్యంత శ్రద్ధ తీసుకొని ఏపుగా పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో నేషనల్ హైవే ఇంజనీరింగ్ అధికారులు, జిల్లా అటవీ శాఖ అధికారి శ్రీనివా స్ జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి జయదేవ్, ఆయా జిల్లా గ్రామపంచాయతీ అధికారి దేవకీ దేవి పాల్గొన్నారు



కలెక్టరేట్ ముట్టడి విజయవంతం చేయండి

- ఎఫ్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ళ నాగరాజు



నవతెలంగాణ-సిద్దిపేట

జూలై 12వ తేదీన జరిగే కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు విద్యార్థులను కోరారు. మంగళవారం ఎస్ఎఫ్ఐ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం సిద్దిపేటలో జరగగా, ఆయన హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలో గత 5 సంవత్సరాల నుంచి విద్యార్థులకి స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయడం లేదని, అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా గత ప్రభుత్వం తీరుగా వ్యవహరిస్తుందన్నారు. విద్యార్థుల విషయంలో నూతన ప్రభుత్వం చిన్న చూపు చూడడం సిగ్గుచేటన్నారు. కొన్ని వేల మంది విద్యార్థులకు స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయకపోవడం వల్ల చాలా మంది పేద మధ్యతరగతి విద్యార్థులు నష్ట పోతున్నారాన్నారు. పై చదువులకి వెళ్ళాలంటే ప్రైవేటు కళాశాలలలో రియంబర్స్మెంట్ విడుదల కాక సర్టిఫికెట్ ఇవ్వడం లేదని, దీని వల్ల విద్యార్థులు ఫీజులు కట్టలేక పై చదువులు చదవలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ప్రభుత్వం విద్యార్థులపై చిన్న చూపు చూడడం వల్ల విద్యార్థులు విద్యకి నోచుకోవడం లేదని, నూతన ప్రభుత్వం విద్య వ్యవస్థలో పూర్తిగా విఫలమైందన్నారు. ఇప్పటి కైన విద్యార్థుల స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలని రాష్ట్ర కమిటీ పిలుపు లో భాగంగా కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం నిర్వహింస్తామన్నారు. పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొని ముట్టడి విజయవంతం చేయాలని అన్నారు. ఈ సామావేశం లో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అముదాల రంజిత్ రెడ్డి, దాసరి ప్రశాంత్, ఉపాధ్యక్షులు కొండం సంజీవ్, నాచారం శేఖర్, చెప్యాల సంతోష్, జిల్లా కమిటీ నాయకులు తాడురి భారత్ కుమార్, బొత్తుల అభి, నరేంద్ర, పురుషోత్తం పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలపై చర్యలు తీసుకోవాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ళ నాగరాజు



నవ తెలంగాణ - సిద్దిపేట

ఎస్ఎంసీ నియమాలకు విరుద్ధంగా నడుస్తున్న సురభి ప్రయివేట్ మెడికల్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు అధికారులను డిమాండ్ చేశారు. మంగళవారం సురభి కళాశాలని సందర్శించిన ఆయన మాట్లాడుతూ సురభి ప్రయివేట్ మెడికల్ కళాశాల ఎస్ఎంసి నియమాలకు పూర్తి విరుద్ధంగా ఉందన్నారు. ఇక్కడ వైద్య సదుపాయాలు లేవని, తరగతి గదులు నిర్మాణంలో వున్నాయని, ఆస్పత్రిలో కనీసం మౌలిక వసతులు లేవని, ముఖ్యమైనటువంటి ఆక్సిజన్, ఫైర్ సేఫ్టీ ఆస్పత్రిలో లేవని అన్నారు. కళాశాలలో విద్యార్థులకి నాణ్యమైన భోజనం అందించడం లేదన్నారు. విద్యార్థుల దగ్గర లక్షల్లో ఫీజులు వసూలు చేస్తూ, సరైన మౌలిక వసతులు కల్పించడం లేదని ఆరోపించారు. మెడికల్ కాలేజ్ బిల్డింగ్ నిర్మాణం ఇంకా పూర్తి కాలేదు అన్నారు. భోజన విషయంలో సరైన నాణ్యత లేక అతి తక్కువ ధరకు వచ్చే వంట నూనెను వాడుతున్నారని, నాణ్యత లేని సరుకులు, పాలిష్ చేసిన బియ్యం వాడడం వల్ల విద్యార్థులకీ ఫుడ్ పాయిజన్ అయిందన్నారు. లక్షలు ఖర్చుపెట్టి చదువుకోవడం కోసం ఇంత దూరం వచ్చినా సరైన భోజన వసతులు, బిల్డింగ్ వసతులు లేక విద్యార్థులు సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆముదాల రంజిత్ రెడ్డి, దాసరి ప్రశాంత్, ఉపాధ్యక్షులు కొండం సంజు, నాచారం శేఖర్ నాయకులు భారత్, అభి, అరుణ్, సంతోష్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులు నడపడం చట్టరీత్యా నేరం

- సిద్దిపేట ట్రాన్స్ ఫోర్స్ పోలీస్ అధికారులు



నవతెలంగాణ-మర్కుక్

గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా బెల్ట్ షాపులు నిర్వహించడం చట్టరీత్యా నేరమని సిద్దిపేట ట్రాన్స్ ఫోర్స్ పోలీసులు తెలిపారు. సోమవారం రాత్రి మర్కుక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గణేష్ పల్లి గ్రామ చౌరస్తాలో స్వర్గం శ్రీనివాస్ కిరాణా షాపులో ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా బెల్ట్ షాప్ నడుపుతున్నారని నమ్మదగిన సమాచారంతో సిద్దిపేట టాస్క్ ఫోర్స్ పోలీస్ అధికారులు, మర్కుక్ పోలీసులతో కలిసి షాపుపై రైడ్ చేసి బీర్లు విస్కీ బాటిల్‌లు, లిక్కర్ బాటిల్ సుమారు మొత్తం 128 లీటర్ల మద్యన్ని స్వాధీనం చేసుకుని మర్కుక్ పోలీసులు కేసు నమోదు చేసి పరిశోధన ప్రారంభించారు.ఈ సందర్భంగా టాస్క్ ఫోర్స్ పోలీస్ అధికారులు మాట్లాడుతూ పోలీస్ కమిషనర్ అనురాధ ఆదేశానుసారం జిల్లాలో అక్రమ వ్యాపారాలపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశామని, జిల్లాలో గ్రామాల్లో, పట్టణాల్లో ఎక్కడైనా ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక, అక్రమ రవాణా చేసిన, పీడీఎస్ రైస్ అక్రమంగా దాచిపెట్టిన, బెల్ట్ షాపులు నడిపిన, గ్యాంబ్లింగ్, పేకాట, ప్రభుత్వం నిషేధించిన గుట్కాలు కలిగి ఉన్నా రవాణా చేసిన మరి ఏదైనా చట్ట వ్యతిరేకమైన కార్యక్రమాలు ఎవరైనా నిర్వహిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వ నిషేధ వ్యాపారం చేస్తున్న వ్యక్తుల సమాచారం తెలిస్తే సిద్దిపేట టాస్క్ ఫోర్స్ అధికారుల నెంబర్లు 8712667445, 8712667446, 8712667447 లకు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.

దుబ్బాకను మరువను

- మెదక్ ఎంపీ



నవతెలంగాణ-దుబ్బాక

యావత్ ప్రపంచమే దుబ్బాక వైపు చూసిన ఉప ఎన్నిక వంటి చారిత్రాత్మక విజయాన్ని అందించిన దుబ్బాక గడ్డను..ఇక్కడి ప్రజలను మరువబోనని మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు హామీ ఇచ్చారు.నా జన్మంతా దుబ్బాక ప్రజలకు రుణపడి ఉంటానని, దుబ్బాక అంటే రఘునందన్, రఘునందన్ అంటే దుబ్బాక అని పేర్కొన్నారు. మెదక్ ఎంపీగా గెలిచిన నాటినుంచి మొట్టమొదటిసారిగా దుబ్బాకకు విచ్చేసిన సందర్భంగా మంగళవారం పురపాలిక కేంద్రంలోని రజనీకాంత్ ఫంక్షన్ హాల్లో బీజేపీ ఆధ్వర్యంలో జరిగిన "దుబ్బాక నియోజకవర్గ ఓటరు మహాశయుల కృతజ్ఞత సభ" కు మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు ముఖ్యాథితిగా హాజరై మాట్లాడారు.తన విజయం కోసం అహర్నిశలు శ్రమించిన బీజేపీ కుటుంబ సభ్యులకు, పదేళ్లలో తనను మూడేళ్లు ఎమ్మెల్యేగా.. ఐదేళ్లు ఎంపీగా అవకాశాన్ని కల్పించినందుకు దుబ్బాక అసెంబ్లీ పరిధి, మెదక్ లోక్ సభ పరిధిలోని ఓటర్లకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.ప్రధాని మోదీ సహకారంతో మెదక్ పార్లమెంట్ తో పాటు దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధి కోసం తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు.వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అధిక సంఖ్యలో బీజేపీ శ్రేణులు ప్రజాప్రతినిధులుగా గెలుపొం దేందుకు నేటి నుంచే ప్రజాసేవ కోసం పునరంకితం కావాలని బీజేపీ శ్రేణులకు దిషానిర్దేశం చేశారు. అనంతరం పలువురు ప్రజాప్రతినిధులు ఎంపీ రఘునందన్ రావుకు శాలువాలతో సన్మానించి జ్ఞాపికలను అందజేశారు.ఈ కృతజ్ఞత సభకు బీజేపీ రాష్ట్ర కార్యదర్శి అంబటి బాలేష్ గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్ మట్ట మల్లారెడ్డి, ఎస్ఎన్ చారీ, బీజేపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు మోహన్ రెడ్డి, కానుగంటి శ్రీనివాస్,విభీషన్ రెడ్డి, అక్బర్ పేట భూంపల్లి, దుబ్బాక మండల అధ్యక్షులు అరిగే కృష్ణ, శివ ప్రసాద్ గౌడ్, సుంకు ప్రవీణ్, చింత సంతోష్, మెరుపుల సాయి కుమార్ గౌడ్, గాజుల భాస్కర్, దూలం వెంకట్ గౌడ్, పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- నూతన అధ్యక్షులు కోత్వాల్ యాద నరేందర్



నవతెలంగాణ-మర్కుక్

నాయిబ్రాహ్మణులు రాజకీయంగా ఎదగాలని,వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని, కొందరి వ్యక్తుల రాజకీయ ఎదుగుదల కోసం నాయి బ్రాహ్మణ సంఘాలను మోసం చేస్తూ పబ్బం గడుపుకుంటున్నారని సిద్దిపేట జిల్లా నాయి బ్రాహ్మణ నూతన అధ్యక్షులు కొత్వాల్ యాదవ్ నరేందర్ అన్నారు. మంగళవారం మర్కుక్ మండల కేంద్రంలో నిర్వహించిన నాయి బ్రాహ్మణ ముఖ్య నాయకులు సమావేశానికి అత్యధికంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఇంతకు ముందు ఉన్న నాయి బ్రాహ్మణ రాష్ట్ర నాయకత్వాలతో సంబందం లేకుండా స్వతంత్రంగా సిద్దిపేట జిల్లా సంఘం నిర్మాణం చేసుకున్నామని, నాయి బ్రాహ్మణులు రోజు రోజుకు ఆర్థికంగా చితికిపోతూ మైనారిటీలోకి పడిపో తున్న తమ కులస్తులను ఆదుకోవడానికి, కేంద్ర రాష్ట ప్రభు త్వాలు ముందుకు రావాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో అన్ని కులాలకు సముచిత స్థానం అందిస్తున్న, తమ మంగళి కులస్తులు మాత్రం గుర్తించడం లేదన్నారు . ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి కార్పొరేషన్ ఏర్పాటు చేసి తక్షణ సహాయం ప్రకటించి ప్రతి కుటుంబానికి ప్రత్యేక నిధులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. ప్రతి కుటుంబానికి రూ. 2 లక్షలు 100 శాతం సబ్సిడితో అందించాలని అన్నారు. వైద్యవృత్తిని ప్రపంచానికి పరిచయం చేసిన వృత్తిగా, నేటి డాక్టర్లకు తీసిపోకుండ ప్రత్యక్ష సేవలు చేసే కులవృత్తి దారులు నాయి బ్రాహ్మణులు అని, ఆరోగ్య విషయంలో రాజీలేని సేవలు చేసే తమ నాయి బ్రాహ్మణులకు నేడు భరోసలేని జీవితాలు గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వా ఉద్యోగాలలో అంగన్వాడీ, ఆశ కార్యకర్తలుగా, ఏఎన్ఎంతో పాటుగా పలు ఉద్యోగాలలో తమ నాయి బ్రహ్మణ మహిళలకు మెదటి ప్రాధాన్యత అవకశాలను కల్పించాలని జిల్లా నాయకులు ముక్త కంఠంగా కోరారు. ప్రభుత్వాలు గర్తించిన దేవాలయాల్లో పాలకవర్గం సభ్యులుగా అవకాశాలను కల్పించాలని, అలాగే కళ్యాన కట్టలో పుట్టువెంటుకలను తీస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని కొమురవెల్లి దేవస్థానం వద్ద నాయిబ్రహ్మణ ధర్మసత్రం ఏర్పాటు చేయాలన్నారు. పక్కన ఉన్న రాష్ట్రాలలో నాయిబ్రా హ్మణులకు పలు విధాలుగా ప్రభుత్వాలు ఆదుకోంటూ, ప్రభుత్వం ప్రత్యేక్షంగా, పరోక్షంగా చట్టసభల్లో అవకాశాలను కూడ కల్పిస్తున్నారని గుర్తు చేశారు. తెలంగాణలో కూడ ఇక్కడి ప్రభుత్వం తమ కులంకు ఆర్థిక భరోసాతో పాటుగా, రాజకీయంగా నామినేట్ పదవులు అందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇప్పటికైనా నాయిబ్రాహ్మణ కులస్థులు, గ్రూపులు కాకుండా ఐక్యతతో ఒకే కులం, ఒకే సంఘం, ఒకే నాయకత్వం, దిషగా అడుగులు వేయాలని, సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని జిల్లా నాయకులు కోరారు. రాష్ట్రంలోని అనేక సంఘాలను ఒకే తాటిపైకి తీసుకరావడానికి సిద్దిపేట జిల్లా సంఘం ఆదర్శంగా నిలువడానికే. నేడు రాష్ట్ర నాయకత్వాలతో సంబందం లేకుండా స్వతంత్రంగా సిద్దిపేట జిల్లా సంఘం నిర్మాణం పూర్తి చేసినట్టు గౌరవ అధ్యక్షులు స్వామి, ఉపాధ్యక్షులు సింగిరాల శ్రీనివాస్, సలహాదారులు కొండూరు అరవింద్ తెలిపారు. ఈ కార్యక మంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సతీష్ కుమార్, మర్కుక్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కోత్వాల్ రాజు, గౌరవ అధ్యక్షులు వెంకన్న, ఉపాధ్యక్షులు లింగంపల్లి నర్సింలు, మండల ప్రధాన కార్యదర్శి తొలిచుక్క నర్సింలు, కోశాధికారి భద్రకామ బాలాకృష్ణ, సహాయ కార్యదర్శి దామరకుంట బాబు, జగదేవ్‌పూర్ గ్రామ అధ్యక్షులు హరిప్రసాద్, నాయి బ్రాహ్మణ సంఘం మండల నాయకులు తదితరులున్నారు.

త్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థికి సన్మానం



నవ తెలంగాణ -రాయపోల్

మంగళవారం మల్లేశంపల్లి గ్రామానికి చెందిన సాయిల్ల వంశీ త్రీపుల్ ఐటీకి ఎంపికైన సందర్భంగా సన్మానం చేశారు.ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులలో కూడా మట్టిలో మాణిక్యాలు ఉన్నారని అలాంటి ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థి ఐఐఐటీ కి ఎంపిక కావడం ఎంతో సంతోషమని మల్లేశంపల్లి తాజా మాజీ సర్పంచ్ దార సత్యనారాయణ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎప్పుడూ లేనివిధంగా ప్రయివేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఫలితాలలో పోటీ పడుతున్నాయని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో మంచి ఫలితాలు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. మల్లేశంపల్లి గ్రామానికి చెందిన సాయిల్ల వంశీ ఆదర్శ పాఠశాలలో విద్యను అభ్యసిస్తూ త్రీపుల్ ఐటీకి ఇంటికి పోవడం మా గ్రామానికి గర్వకారణం అన్నారు. నిరుపేద విద్యార్థులకు గురుకుల పాఠశాలలు, మోడల్ పాఠశాలలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు ఎంతో వరంగా మారిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న పేద విద్యార్థులు నేడు ఉన్నత స్థాయిలో ఉన్న విషయాన్ని నేటితరం విద్యార్థులు గుర్తు చేసుకుని వారిని ఆదర్శంగా తీసుకొని విద్యారంగంలో ముందుకు వెళ్లాలన్నారు. కార్పొరేట్ ప్రయివేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యా బోధన జరుగుతుందని, దౌల్తాబాద్ లో ప్రభుత్వ మూడు జూనియర్ కళాశాలలు ఉండడంతో ఉత్తీర్ణత శాతం ప్రతి ఏడాది పెరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో త్రీపుల్ ఐటీకి ఎంపీ కావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు భాస్కర్, గణేష్, నరేష్, ఎండీ షహీద్, ఎండీ గౌస్, బాను, రాజు, ఎండీ ఆసిప్, శివంది రాజు, తుమ్మ అలెగ్జాండర్, సాయిల్ల కిరణ్ పాల్గొన్నారు

గుట్కా ప్యాకెట్ల పట్టివేత

నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్

ప్రభుత్వం నిషేధించిన రూ.16,680 వేల విలువ గల గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్టు సిద్దిపేట టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు. సిద్దిపేట టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో కే. సంతోష్ తన ఇంటిలో ప్రభుత్వం నిషేధించిన వివిధ రకాల గుట్కా ప్యాకెట్లు కలిగి ఉన్నాడన్న సమాచారంతో టూ టౌన్ పోలీసులతో కలసి వెళ్లి ఇంట్లో తనిఖీలు చేసి కాటన్ బాక్సులలో ప్యాక్ చేసి ఉన్న గుట్కా ప్యాకెట్లను పట్టుకున్నట్టు తెలిపారు. ఎవరైనా చట్ట వ్యతిరేకమైన కార్యక్రమాలు ఎవరైనా నిర్వహిస్తున్నట్టు తెలిస్తే సిద్దిపేట టాస్క్ ఫోర్స్ అధికారుల నెంబర్లు 8712667445, 8712667446, 8712667447 లకు సమాచారం అందించాలని సూచించారు.